thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

గ్లెన్ ఫిలిప్స్, నికోల్స్ పోరాటం.. భారత్‌కు ఐదు వికెట్లు



11

చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 216 | జగిత్యాల శుక్రవారం 20 నవంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |



కోటికి పైగా కుటుంబాలకు
ఇందిరమ్మ బీమా పథకం

- సిద్దిపేటలో ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- నేటినుండి జిల్లాల్లో దరఖాస్తుల స్వీకరణ
- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం
- నమోదు సమయంలోనే నామినీ వివరాల సేకరణ

వరంగల్, నవంబర్ 19:
రాష్ట్రంలోని కోటికిపైగా కుటుంబాల కోసం ఉద్దేశించిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సిద్దిపేటలో గురువారం ప్రారంభించారు. ఈ పథకం కోసం అన్ని జిల్లాల్లో శుక్రవారంనుంచి దరఖాస్తు ఫారాలను స్వీకరించనున్నారు. ఇందిరమ్మ జీవిత బీమా కింద ప్రతి కుటుంబంలో సంపాదించే ఒక వ్యక్తి పేరిట బీమా నమోదు చేస్తారు. కుటుంబంలో ఒకరికి మించి సంపాదిస్తున్నా ఒకరికే నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. ఎవరిని నమోదు చేయించాలనేది కుటుంబ సభ్యులు నిర్ణయించుకోవాలి. ఆ వ్యక్తి మరణిస్తే రూ.5 లక్షల సాయాన్ని కుటుంబానికి అందిస్తారు. ప్రతి కుటుంబంలో 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు కలిగిన (1967 నవంబరు 19 నుంచి

మిగతా 2వ పేజీలో..

సిద్దిపేట జిల్లాలో రూ.544.11 కోట్లతో
అభివృద్ధి పనులు

- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన సీఎం రేవంత్

2



సాగు బాగుతోనే సుభిక్షమైన తెలంగాణ

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఇందిరా గాంధీ హయాంలో వ్యవసాయాభివృద్ధిపై పుస్తకావిష్కరణ

హైదరాబాద్‌లో ఐఆర్‌సీ 85వ వార్షిక సదస్సు ప్రారంభం

- జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ
- రహదారుల ఆధునిక సాంకేతికతలు, భద్రతపై 19 సాంకేతిక సమావేశాలు
- తెలంగాణ రహదారుల ప్రాజెక్టులకు ఆధునిక పరిజ్ఞానంతో ప్రయోజనం
- 3,500 మందికి పైగా ప్రతినిధులు, 400 ఎగ్జిబిషన్ స్టాళ్లు

3




2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్
డాలర్ల ఆర్థిక వ్యవస్థ

- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ లక్ష్యం
- జాతీయ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతానికి పెంపు
- ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య అతిపెద్ద తయారీ కారిడార్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



3



3

రహదారుల మన్నికలో
రాజీ పడొద్దు

- ప్రతీ ఇంజినీర్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి
- ఇంజినీర్లకు కేంద్ర మంత్రి గడ్కరీ చురకలు



పెట్టుబడుల నిర్ణయాల్లో ‘ఇండియా ఫస్ట్’కు ప్రాధాన్యం: మోదీ

- రాబోయే 20 ఏళ్ల పెట్టుబడులకు ఇదే ప్రాతిపదిక కావాలి
- వ్యవసాయం, ఔషధ రంగాల్లో పెట్టుబడులు పెంచాలి
- దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలి
- పన్ను రాయితీల ప్రయోజనాలు ఉద్యోగులకూ అందాలి

4



ఎన్నికల సవాళ్లను ఎదుర్కొంటూ పోరాటం కొనసాగిస్తాం: రాహుల్

- ఎన్నికల లోపాల పేరుతో పోటీకి దూరమైతే ప్రజాస్వామ్యానికి ముప్పు
- చికాగో విశ్వవిద్యాలయ కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేత వ్యాఖ్యలు
- ప్రజాస్వామ్య హక్కులను మోదీ ప్రభుత్వం దెబ్బతీస్తోందని జైరాం రమేశ్ ఆరోపణ

4

కూకట్‌పల్లి ట్రక్ పార్కింగ్ భూముల
వేలాన్ని రద్దు చేయాలి

- భూముల అమ్మకాలపై ఉన్న శ్రద్ధ పాలనపై లేదు
- ఇప్పటికే 26 వేల ఎకరాలు విక్రయించారంటూ ఆరోపణ
- రూ.50 వేల కోట్ల భూముల అమ్మకానికి ప్రభుత్వ లక్ష్యం
- వేలం నిలిపివేయకుంటే ఆందోళన ఉధృతం
- బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత టి. హరీశ్‌రావు

2



ఓయాసిస్ ఫెర్టిలిటీ కేంద్రాల్లో అక్రమ అండాల సేకరణ

- ఒకే అనుమతితో 43 కేంద్రాల్లో ఓయాసిస్, సద్గురు కార్యకలాపాలు
- ఇతర రాష్ట్రాల మహిళలకు రూ.50 వేల వరకు ఆశ చూపి అండాల సేకరణ
- వైద్యుల పర్యవేక్షణ లేకుండానే హార్మోన్ ఇంజెక్షన్లు ఇచ్చినట్లు ఆరోపణలు
- 66 డోనర్ కేసుల్లో 19 మంది వివరాలు గల్లంతు
- ఓయాసిస్ ఎండీ దుర్గారావు సహా పలువురు పరారీ



3



మలక్‌పేట ఇందిరమ్మ టవర్స్‌కు త్వరలో భూమి పూజ

- ఏడాదిలోగా నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలి
- హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ గౌతం

3

ఉపాధి హామీ పనులకు పెరుగుతున్న కూలీల హాజరు

- ఒక్కరోజే ఆరు లక్షల మందికి పైగా కూలీలకు పని
- గ్రామపంచాయతీకి రోజుకు 60 మంది హాజరే లక్ష్యం
- డిసెంబర్ 1 నుంచి మేట్లకు బాధ్యతలు
- జలసిరి, గ్రామీణ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క




3

తెలంగాణ నీటి హక్కులపై
రాజీ ప్రసక్తే లేదు

- సాగర్ నుంచి ఏపీ నీటి తరలింపు ప్రయత్నాలను అడ్డుకుంటాం
- కృష్ణా, గోదావరి జలాల్లో రావాల్సిన ఒక్క చుక్కనూ వదులుకోం
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ

2





డ్రగ్స్ మహమ్మారిపై సమరశంఖం..

- 'నషా ముక్త్ భారత్ యాత్ర'కు కింగ్ నాగార్జున మద్దతు..

3



రాబోయే ఎన్నికలకు సిద్ధమవ్వాలి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు

3



సిద్దిపేట జిల్లాలో రూ.544.11 కోట్లతో
అభివృద్ధి పనులు

సిద్దిపేట, నవంబర్ 19 :

సిద్దిపేట జిల్లా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సిద్దిపేట , దుబ్బాక నియోజకవర్గాల్లో వివిధ అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం దివంగత ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా సిద్దిపేటలో ఇందిరమ్మ విగ్రహానికి ముఖ్యమంత్రి పుష్పాంజలి ఘటించారు. అక్కడినుంచి బహిరంగ సభా ప్రాంగణానికి పాదయాత్రగా బయలుదేరారు. సీఎంతోపాటు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ శ్రేణులు పాదయాత్రగా బహిరంగ సభాస్థలికి వెళ్లారు. కాగా, ఒక్కొక్క చోట రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి, జిల్లాలోని ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో రూ.15.44 కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి, రూ.13.50 కోట్లతో ఆరు తహసీల్దార్ కార్యాలయ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే చిన్న కోడూరు మండలంలో రూ.7.50 కోట్లతో, దౌల్తాబాద్ మండలంలో రూ.7.80 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణానికి శంకుస్థాపన. జనగామ నియోజకవర్గంలో రూ.6.89 కోట్లతో మూడు విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు.

ప్రారంభోత్సవాలు

జిల్లాలో రూ.54.67 కోట్లతో నిర్మించిన 14 విద్యుత్ సబ్ స్టేషన్లకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. కొమురవెల్లి మల్లన్న ఆలయంలో రూ.14.35 కోట్లతో నిర్మించిన వసతి సత్రం, రూ.12 కోట్లతో నిర్మించిన క్యూ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. రూ.6.50 కోట్లతో నిర్మించిన 53 గ్రామ మహిళా సంఘాల భవనాలకు, రాయపోల్ మండలంలో రూ.3.87 కోట్లతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. గజ్వేల్‌లో రూ.1.59 కోట్లతో నిర్మించిన విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయానికి కూడా ప్రారంభోత్సవం చేశారు.

సాగు బాగుతోనే సుభిక్షమైన
తెలంగాణ

- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
- **పలువురు ప్రముఖులకు ఇందిరా గాంధీ కృషి రత్న పురస్కారాల ప్రదానం**
- **ఇందిరా గాంధీ హయాంలో వ్యవసాయాభివృద్ధిపై పుస్తకావిష్కరణ**

హైదరాబాద్, నవంబర్ 19 :

సాగు బాగుంటేనే సుభిక్షమైన తెలంగాణ సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగు నీరు అందించాలనేదే తమ లక్ష్యమన్నారు. వ్యవసాయ రంగంలో బహుముఖ సేవలు అందించిన ప్రముఖులకు ఇందిరా గాంధీ కృషి రత్న పురస్కారాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసంలో గురువారం అందజేశారు. వ్యవసాయ రంగానికి సేవలు అందించిన శాస్త్రవేత్తలు, పాత్రికేయులు, రైతులను రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఈ అవార్డులకు ఎంపిక చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా డాక్టర్ ఎం. సుగుణాకర్ రెడ్డి, డాక్టర్ ఎస్.డి.శిఖామణి ((వ్యవసాయ శాస్త్రవేత్తలు), దిలీప్ రెడ్డి (పాత్రికేయుడు), లోనావత్ శాంతాబాయి (గిరిజన రైతు), కె.లావణ్య (సేంద్రియ రైతు) ఇందిరా గాంధీ కృషి రత్న పురస్కారాలు అందుకున్నారు. ప్రధానమంత్రిగా ఇందిరా గాంధీ వ్యవసాయాభివృద్ధికి అందించిన చేయూత, ఆ కాలంలో సాగు రంగంలో చోటుచేసుకున్న అభివృద్ధిపై రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ రూపొందించిన పుస్తకాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి, కమిషన్ సభ్యులు కె.వి.ఎన్.రెడ్డి, ఎం.భవాని రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ నీటి హక్కులపై
రాజీ ప్రసక్తే లేదు



హైదరాబాద్/హుజూర్‌నగర్ , నవంబర్ 19:

కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు హక్కుగా రావాల్సిన ఒక్క చుక్క నీటిని కూడా వదులుకునే ప్రసక్తే లేదని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర నీటి హక్కులను కాపాడేందుకు అవసరమైన ప్రతి సంస్థాగత, న్యాయ వేదికపైనా పోరాడతామని ప్రకటించారు. హుజూర్‌నగర్‌లో గురువారం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. నాగార్జునసాగర్ నుంచి 1.8 టీఎంసీల నీటిని తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ చేస్తున్న ప్రయత్నాలను తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. ఈ ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వానికి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు అభ్యంతరాలు తెలిపామన్నారు. తెలంగాణకు రావాల్సిన వాటాను దెబ్బతీసే ఏకపక్ష చర్యలను అడ్డుకుంటామని ఉత్తమ్ చెప్పారు. భారత వైమానిక దళంలో యుద్ధ విమాన పైలట్‌గా చైనా, పాకిస్థాన్ సరిహద్దుల్లో విధులు నిర్వర్తించాను.. అప్పుడు దేశాన్ని కాపాడేందుకు చూపిన క్రమశిక్షణ, ధైర్యం, పట్టుదలతోనే ఇప్పుడు తెలంగాణ ప్రయోజనాలను కాపాడేందుకు పనిచేస్తాను.. కృష్ణా నీళ్లైనా, గోదావరి నీళ్లైనా మన హక్కులో ఒక్క చుక్కను కూడా వదులుకోం' అని ఉత్తమ్ అన్నారు. రాష్ట్ర నీటి హక్కుల పరిరక్షణ రైతుల సాగునీరు, ప్రజల తాగునీరు, లక్షలాది కుటుంబాల జీవనోపాధితో ముడిపడి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నీటి వినియోగాన్ని మెరుగుపరచడంతో సాగు విస్తీర్ణం, వరి ఉత్పత్తి, ధాన్యం సేకరణ పెరిగాయని చెప్పారు. దేశంలోనే అత్యధికంగా వరి ఉత్పత్తి చేసే రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయాలు, పనుల తీరుకు కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల సమస్యలే నిదర్శనమని ఉత్తమ్ విమర్శించారు. వారసత్వంగా వచ్చిన సమస్యలను సరిదిద్ది, సాగునీటి మౌలిక వసతులను పరిరక్షించి, అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగిస్తామని తెలిపారు. వాతావరణ పరిస్థితులు, రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి అవసరాల కోసం నీటి సంరక్షణపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రాష్ట్ర నీటి హక్కుల కోసం వెనుకడుగు వేయదని ఉత్తమ్ స్పష్టం చేశారు.

సిద్దిపేటలో కుటుంబ రాజకీయాలు

- **రెండోసారి, మూడోస్సారి ఇందిరమ్మ రాజ్యమే**
- **కాంగ్రెస్ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే మంత్రి పదవి ఇచ్చే బాధ్యత నాది**
- **సిద్దిపేట బహిరంగ సభలో కేసీఆర్, హరీష్, కేటీఆర్, సంతోష్ రావులపై తీవ్ర విమర్శలు**
- **అన్ని అంశాలపై అసెంబ్లీలో చర్చకు రావాలి**
- **సిద్దిపేట మెడికల్ కాలేజీకి అనంతుల మదన్ మోహన్ పేరు**





సిద్దిపేట, నవంబర్ 19:

మామ పోతే అల్లుడు.. అల్లుడు పోతే బామ్మర్ది అన్నట్లుగా సిద్దిపేటలో కుటుంబ రాజకీయాలు సాగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. సిద్దిపేటలో కాంగ్రెస్ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే మంత్రి పదవి ఇచ్చే బాధ్యత తమదని హామీ ఇచ్చారు. సిద్దిపేటలో గురువారం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. సోలిపేట రామలింగారెడ్డి, చెరుకు ముత్యంరెడ్డి, పాపారావు, లక్ష్మణ్ వంటి ఉద్యమకారులు, నేతలు అప్పులు, ఆర్థిక ఇబ్బందులు, ప్రాణాల కోల్పోతే కేసీఆర్ కుటుంబానికి, కేటీఆర్ మామకు, హరీష్ బామ్మర్ది సుమన్ రావుకు వేల కోట్ల ఆస్తులు, ఫామ్‌హౌసులు ఎలా వచ్చాయని నిలదీశారు. గత పాలనలో శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు అన్యాయం జరిగిందని, తమ ప్రజా ప్రభుత్వంలో శంకరమ్మకు, అలాగే చాకలి ఐలమ్మ మనవరాలికి మహిళా కమిషన్ సభ్యులుగా అవకాశం కల్పించామని తెలిపారు.

సాగునీటి ప్రాజెక్టులు..

అసెంబ్లీ చర్చకు సవాల్

2014లో సాగునీటి శాఖ మంత్రిగా పనిచేసిన హరీష్ రావుకు రెండోసారి అధికారంలోకి వచ్చాక అదే పదవి ఎందుకు ఇవ్వలేదని సీఎం ప్రశ్నించారు. హరీష్ తీరు వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యం చెందిందని, పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయకుండా అన్యాయం చేశారని ఆరోపించారు. రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు విషయంలోనూ గత పాలకుల వైఖరిని తప్పుబడుతూ అన్ని అంశాలపై అసెంబ్లీలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఏ మొఖం పెట్టుకుని ఇవాళ బజారులో తిరుగుతున్నావ్ హరీష్ అంటూ నిలదీశారు. కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్, సంతోష్ రావులను పంచభూతాలను చెరబట్టిన దుష్ట చతుష్టయంగా అభివర్ణించారు. అస్తి కోసం సొంత చెల్లిని ఇంట్లోంచి గెంటేసిన ఒకాయన రాష్ట్రంలో ఆడబిడ్డలను చూస్తారట అని ఎద్దేవా చేశారు. బతుకమ్మ చీరల పంపిణీలోనూ కమీషన్లు తీసుకున్నారని, తాము కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరలు పంపిణీ చేశామని చెప్పారు.

2029, 2034 వరకు ఇందిరమ్మ రాజ్యమే

పాపాల భైరవుడు రావాలంట.. ప్రజా పాలన పోవాలట.. మళ్లీ వచ్చి తెలంగాణను ఉన్నకాడికి ఊడ్చుకోవాలని చూస్తున్నారు అని బీఆర్ ఎస్‌పై సీఎం నిప్పులు చెరిగారు. సాగునీటి ముసుగులో మీ మొసలి కన్నీళ్లు ప్రజలకు తెలుసునన్నారు. తాను ఈ తెలంగాణ బిడ్డను.. ఈ గడ్డపైనే పుట్టా.. ఈ మట్టిలోనే కలుస్తా.. తనను ఆశీర్వదించిన తెలంగాణ నేలకు అన్యాయం చేస్తానా అని ప్రశ్నించారు. ఈ దుర్మార్గులు.. నీచులు తనను శంకించేలా ఆటలాడుతున్నారన్నారు. బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదని, 2029లో రెండోసారి, 2034 వరకు తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యమే కొనసాగుతుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. 1983 నుంచి 2023 వరకు వివిధ ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను తాము ఆపలేదని, వాటిని కొనసాగిస్తూనే కొత్త సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. రైతులకు ₹2 లక్షల రుణమాఫీ, రేషన్ కార్డుల మంజూరు, సన్న బియ్యం పంపిణీ, మూడేళ్లలో 8 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు (2 లక్షల ఇళ్లు పూర్తి), రైతు భరోసాకు రూ.36,000 కోట్లు, వ్యవసాయ రంగానికి రూ.1.78 లక్షల కోట్ల కేటాయింపు, సన్న వడ్లకు బోనస్, 200 యూనిట్ల ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 75,000 ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని వివరించారు. రాష్ట్ర ప్రజలు బానిసత్వం కోరుకుంటున్నారా లేక ప్రజా పాలన కోరుకుంటున్నారా అనేది ఆలోచించుకోవాలని పిలుపునిచ్చారు.

సిద్దిపేట మెడికల్ కాలేజీకి అనంతుల పేరు

సిద్దిపేట గడ్డపై తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన అనంతుల మదన్ మోహన్ సేవలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 1983లో కేసీఆర్‌పై విజయం సాధించి ఈ ప్రాంతంలో కాంగ్రెస్ జెండా ఎగురవేసిన ఘనత అనంతుల మదన్ మోహన్‌దేనని కొనియాడారు. అయితే ఆయన పేరును చరిత్ర పుటల్లోంచి చెరిపేయడానికి కేసీఆర్, హరీష్ రావు కుట్రలు పన్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో సిద్దిపేట మెడికల్ కాలేజీకి అనంతుల మదన్ మోహన్ పేరు పెట్టాలని మంత్రి దామోదర్ రాజనర్సింహను ఆదేశించారు. కేసీఆర్‌కు తొలిసారి రాజకీయ అవకాశం ఇచ్చింది మదన్ మోహనేనని, అవకాశం ఇచ్చిన వ్యక్తిపైనే పోటీ చేయడం నమ్మకద్రోహమని విమర్శించారు. ఎన్టీఆర్, చంద్రబాబులకు వెన్నుపోటు పొడిచి కొత్త రాజకీయ దుకాణం పెట్టుకున్నారని, 2004లో వార్డు మెంబర్ కూడా కాని హరీష్ రావు వైఎస్సార్ చొరవతో ఎదిగి ఆతర్వాత కాంగ్రెస్‌పై కుట్రలు మొదలుపెట్టారని ఆరోపించారు. మీరు ఎన్ని బహురూపు వేషాలు వేసినా ప్రజలు నమ్మరన్నారు.



కూకట్‌పల్లి ట్రక్ పార్కింగ్ భూముల వేలాన్ని రద్దు చేయాలి

హైదరాబాద్, నవంబర్ 19:

ప్రజా అవసరాల కోసం కేటాయించిన భూములను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం విక్రయానికి పెడుతోందని బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత టి. హరీశ్‌రావు విమర్శించారు. భూముల అమ్మకాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చూపుతున్న శ్రద్ధ పాలనపై లేదని మండిపడ్డారు. కూకట్‌పల్లి ట్రక్ పార్కింగ్ స్థలం వేలాన్ని వ్యతిరేకిస్తూ వామపక్షాలు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు.

ట్రక్ పార్కింగ్ కోసం ప్రత్యేకంగా సేకరించిన ఈ భూమిని ఇతర అవసరాలకు వినియోగించడం చట్టవిరుద్ధమని అన్నారు. భూ సేకరణ చట్టం ప్రకారం నిర్దేశిత ప్రయోజనం నెరవేరకపోతే తిరిగి రైతులకు అప్పగించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. హెచ్‌సీయూ, ఉర్దూ యూనివర్సిటీ, అసైన్డ్ భూములను కూడా ప్రభుత్వం విక్రయానికి పెడుతోందని ఆరోపించారు.

ఇప్పటికే 26 వేల ఎకరాల భూమిని విక్రయించారని, మరో 20 వేల ఎకరాలను తనఖా పెట్టి రూ.20 వేల కోట్ల రుణం పొందారని హరీశ్‌రావు ఆరోపించారు. మధ్యవర్తులకు వందల కోట్ల రూపాయల కమీషన్లు చెల్లిస్తున్నారని విమర్శించారు. మియాపూర్, మామిడిపల్లిలో 400 ఎకరాల చొప్పున విక్రయించేందుకు సిద్ధమవుతున్నారని, ఈ ఏడాది రూ.50 వేల కోట్ల విలువైన భూముల అమ్మకాన్ని లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. కాప్రా, అమీన్‌పూర్, బాచుపల్లిలో చిన్న స్థలాలను కూడా వదలడం లేదని, వాటితో పాఠశాలలు, పార్కులు, ఆసుపత్రులు నిర్మించవచ్చని సూచించారు. కూకట్‌పల్లి ట్రక్ పార్కింగ్ స్థలంలో రోజుకు వెయ్యి కంటైనర్ల కార్యకలాపాలు జరుగుతాయని, వేలం వల్ల కార్మికుల ఉపాధి, కంటైనర్ కార్పొరేషన్ నిర్వహణపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు ఈ భూమి ఎంతో కీలకమని చెప్పారు. ప్రభుత్వ భూములు, ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయించవద్దన్న రాహుల్‌గాంధీ సూచనలను కూడా రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని విమర్శించారు.ట్రక్ పార్కింగ్ భూముల వేలాన్ని తక్షణమే రద్దు చేయాలని అఖిలపక్షం తరపున డిమాండ్ చేశారు. లేకుంటే ఈ నెల 22, 23 తేదీల్లో జరిగే నిరాహార దీక్షల్లో బీఆర్ఎస్ పాల్గొంటుందని, 25న హెచ్‌ఎండీఏ ముట్టడిలోనూ భాగస్వామి అవుతుందని హెచ్చరించారు. సీపీఐ, సీపీఎం సహా వామపక్షాలతో కలిసి పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఇతర పార్టీల నేతలు పాల్గొన్నారు.

కోటికి పైగా కుటుంబాలకు
ఇందిరమ్మ బీమా పథకం

మొదటిపేజీ తరువాయి

2008 నవంబరు 18 మధ్య జన్మించిన వారు) సంపాదించే వ్యక్తులలో ఒకరిని నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జనన ధ్రువీకరణకు ఆధార్ కార్డులోని తేదీని పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియ ఈ నెల 19 నుంచి డిసెంబరు 18 లోపు పూర్తి చేయాలని నిర్దేశించింది. నమోదు పూర్తయిన తర్వాత బీమా పొందిన వ్యక్తి ఆ కాలంలో గరిష్ఠ వయోపరిమితిని దాటినా కనీసం ఒక సంవత్సరంపాటు పూర్తి బీమా కవరేజీ పొందుతారని పేర్కొంది.

నమోదు ప్రక్రియ ఇలా..

అర్హత కలిగిన ప్రతి కుటుంబం సులభంగా పథకంలో చేరేలా సహాయక నమోదు శిబిరాలు నిర్వహించాలి. శిబిరాల నిర్వహణకు రెండు రోజుల ముందు నుంచే గ్రామాలు, వార్డుల్లో దండోరా వేయించడంతోపాటు ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేయించాలి. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, నగరాలు/పట్టణాల్లో వార్డు అధికారి శిబిరం ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తారు. ఆయనతోపాటు ఒక హెల్ప్ డెస్క్ ఇన్‌చార్జి కూడా ఉంటారు. పౌరసరఫరాల శాఖ వద్ద ఉన్న ఆహారభద్రత కార్డుల డేటా ఆధారంగా నిర్ణీత నమూనాలో వ్యక్తుల వివరాల నమోదు జరగాలి. ఆ డేటాలో పేర్లు నమోదు కాని, రేషన్ కార్డు లేని వారి కోసం విడిగా మరో దరఖాస్తు ఫారం ఇస్తారు. అందులో బీమా పొందే సభ్యుని వివరాలు, ఆధార్ ఆధారిత జనన తేదీ, కుటుంబ వివరాలు, నామినీ వివరాలను నమోదు చేయాలి. దరఖాస్తు ఫారం సంఖ్యగా రేషన్ కార్డు సంఖ్యను ఉపయోగించాలి. రేషన్ కార్డు లేని కుటుంబాలకు ప్రత్యేక కోడ్ కేటాయించాలి. ఇతర జిల్లాకు చెందిన రేషన్ దరఖాస్తు ఫారం సంఖ్యగా రేషన్ కార్డు సంఖ్యను ఉపయోగించాలి. రేషన్ కార్డు లేని కుటుంబాలకు ప్రత్యేక కోడ్ కేటాయించాలి. ఇతర జిల్లాకు చెందిన రేషన్ కార్డు కలిగిన కుటుంబాలు కూడా సమీప శిబిరంలో నమోదు చేసుకోవచ్చు. ఒకరి కంటే ఎక్కువమంది నామినీలు ఉన్నప్పుడు వారికి రూ.5 లక్షల్లో క్లెయిమ్ వాటాలు ఎలా వర్తిస్తాయో నమోదు సమయంలో అధికారులు స్పష్టంగా వివరించాలి. రాష్ట్ర స్థాయిలో హెల్ప్ డెస్క్, జిల్లాల్లో హెల్ప్ లైన్ ఏర్పాటు చేయాలి అని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది.



కోటికి పైగా కుటుంబాలకు లబ్ధి

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో రాష్ట్రంలోని సుమారు 1,12,36,849 కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. రాష్ట్ర ప్రభుత్వం 2024లో చేసిన సమగ్ర ఇంటింటి సర్వే ఆధారంగా జిల్లాల వారీగా కుటుంబాల సంఖ్య ఇలా ఉంది.

ఆదిలాబాద్	2,26,579
కుమురం భీం ఆసిఫాబాద్	1,64,349
మంచిర్యాల	2,57,357
నిర్మల్	2,50,035
నిజామాబాద్	4,96,999
జగిత్యాల	3,44,091
పెద్దపల్లి	2,48,088
జయశంకర్ భూపాలపల్లి	1,40,101
భద్రాద్రి కొత్తగూడెం	3,44,248
మహబూబాబాద్	2,69,726
వరంగల్	2,78,769
హనుమకొండ	2,68,229
కరీంనగర్	3,37,924
రాజన్న సిరిసిల్ల	1,92,405
కామారెడ్డి	3,11,922
సంగారెడ్డి	4,19,277
మెదక్	2,30,275
సిద్దిపేట	3,31,771
జనగాం	1,77,197
యాదాద్రి భువనగిరి	2,60,881
మేడ్చల్ మల్కాజ్‌గిరి	3,12,275
గ్రేటర్ హైదరాబాద్	20,24,784
రంగారెడ్డి	5,63,266
వికారాబాద్	2,91,108
మహబూబ్‌నగర్	2,52,210
జోగులాంబ గద్వాల్	1,76,114
వనపర్తి	1,59,019
నాగర్‌కర్నూల్	2,57,344
నల్గొండ	5,11,925
సూర్యాపేట	3,71,729
ఖమ్మం	5,05,984
ములుగు	99,641
నారాయణపేట	1,61,227



హైదరాబాద్‌లో ఐఆర్‌సీ 85వ వార్షిక సదస్సు ప్రారంభం

హైదరాబాద్, నవంబర్ 19:

ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) 85వ వార్షిక సదస్సు హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో గురువారం ప్రారంభమైంది. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సమక్షంలో జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు.

ఈ సదస్సులో కృత్రిమ మేధ, డిజిటల్ సాంకేతికతలు, పర్యావరణహిత నిర్మాణాలు, ఎలక్ట్రిక్ మొబిలిటీ, రోడ్డు భద్రత, టన్నెల్స్ వంటి అంశాలపై 19 సాంకేతిక సమావేశాలు నిర్వహిస్తున్నారు. పాదచారుల హక్కులు, ఫుట్‌పాత్‌లు, సురక్షిత రోడ్డు దాటే సదుపాయాలపై ప్రత్యేక చర్చలు జరగనున్నాయి. దేశవిదేశాలకు చెందిన 3,500 మందికి పైగా నిపుణులు, ఇంజనీర్లు, పరిశోధకులు పాల్గొంటున్నారు. సుమారు 400 స్టాళ్లలో ఆధునిక రహదారి నిర్మాణ పరికరాలు, సాంకేతికతలను ప్రదర్శిస్తున్నారు.

ఈ సదస్సు ద్వారా తెలంగాణలో రీజినల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్లు, ఫ్యూచర్ సిటీ-మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్ హైవే వంటి ప్రాజెక్టులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రానుంది. గ్రామీణ రహదారుల నిర్మాణంలోనూ కొత్త పద్ధతులు ఉపయోగపడనున్నాయి. రాష్ట్రంలో రోడ్లు, వంతెనల కోసం 2026-27 బడ్జెట్‌లో రూ.5,677 కోట్లు కేటాయించారు.

సదస్సును హైదరాబాద్‌కు తీసుకురావడంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కీలక పాత్ర పోషించారు. తెలంగాణ రహదారుల అభివృద్ధి ప్రణాళికలను జాతీయ వేదికపై పరిచయం చేయడంతోపాటు, పాదచారుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా ఆధునిక ప్రమాణాలతో రహదారుల అభివృద్ధి చేపట్టడమే లక్ష్యంగా ఈ సదస్సు ఉపయోగపడనుంది.

కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, రఘునందన్‌రావు, పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, ఐఆర్‌సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రహదారుల మన్నికలో రాజీ పడొద్దు

హైదరాబాద్, నవంబర్ 19:

రహదారుల నిర్మాణాల్లో నాణ్యత, భద్రత, మన్నిక విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) 85వ వార్షిక సదస్సును కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కోరారు. కాంట్రాక్టర్లు, కన్సల్టెంట్లు, ఇంజనీర్లు పూర్తి బాధ్యత తీసుకుని సంపూర్ణంగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సమావేశాన్ని నితిన్ గడ్కరీ జ్యోతిప్రజ్వలన చేసి గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారుల నిర్మాణంలో చాలా రికార్డులు సాధించామని తెలిపారు. హైవేల నిర్మాణంలో ఇంజనీర్లు కీలకంగా వ్యవహరించారని కొనియాడారు. రోడ్ కనెక్టివిటీలో ప్రపంచంలోనే భారత్ నంబర్ వన్‌గా ఉందని చెప్పారు. మౌలిక వసతుల కల్పనలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణంలో నాణ్యత పాటిస్తున్నట్లు తెలిపారు. రోడ్లు మంచిగా ఉంటే భారీగా పెట్టుబడులు వస్తాయని వివరించారు. కాగా, దేశంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి.. ఈ మాటలు చెప్పడం కొంచెం ఇబ్బందిగా ఉన్నా చెప్పక తప్పని పరిస్థితి.. ఏటా రోడ్డు ప్రమాదాల్లో లక్షల మంది చనిపోతున్నారు.. వారిలో ఎక్కువమంది యువకులే ఉంటున్నారు.. ఇకపై రోడ్లపై బ్లాక్ స్పాట్స్ కనిపించకూడదు. బ్లాక్‌స్పాట్ ఉండకుండా చూడాల్సిన బాధ్యత ఇంజనీర్లదే అని గడ్కరీ స్పష్టం చేశారు. ఫ్లై ఓవర్ నిర్మించాల్సిన చోట నిర్మించం, అండర్‌పాస్ ఇవ్వాల్సినచోట ఇవ్వం, జంక్షన్ల గురించి పట్టించుకోం అని ఇంజినీర్లకు చురకలంటించారు. ఆ ప్రమాదాలకు మనమే బాధ్యులమని స్పష్టం చేశారు. దీనిపై మీలో కచ్చితంగా బాధ్యతాయుతమైన ధోరణి రావాలని అన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడేందుకు ఐఆర్‌సీలోని ప్రతి ఇంజనీర్ నిబద్ధత, బాధ్యత, సహకారం తనకు కావాలని తెలిపారు. తెలంగాణ కోసం తన వంతుగా మీకు ఎంత సహాయం చేయగలనో అంత వరకు చేస్తానని రేవంత్ ప్రభుత్వానికి ఈ సందర్భంగా గడ్కరీ భరోసా ఇచ్చారు.

మలక్‌పేట ఇందిరమ్మ టవర్స్‌కు త్వరలో భూమి పూజ

హైదరాబాద్, నవంబర్ 19 :

మలక్‌పేట నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణానికి త్వరలోనే భూమి పూజ నిర్వహించనున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి.గౌతం తెలిపారు. నిర్మాణ పనులను పూర్తి పారదర్శకతతో, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి ఏడాదిలోగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. మలక్‌పేట, నాగోలు బండ్ల గూడ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణ ప్రదేశాలను గురువారం ఆయన సందర్శించి పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మలక్‌పేటలో మొత్తం 15 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా అందులో పైలట్ ప్రాజెక్టుగా 2.5 ఎకరాల విస్తీర్ణంలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా త్వరలోనే భూమి పూజ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం అధికారులు, కాంట్రాక్టర్లతో నిర్మాణ పనులపై ఆయన సమీక్షించారు. ప్రాజెక్టు నిర్దేశిత గడువు ఏడాది మాత్రమే ఉన్నందున ఎలాంటి జాప్యం జరగకుండా పనులను నిరంతరాయంగా కొనసాగించాలని స్పష్టం చేశారు. పాత భవనాల కూల్చివేత పనులను వేగవంతం చేసి తదుపరి నిర్మాణ కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. నిర్మాణంలో ప్రతి దశలోనూ నాణ్యతను కచ్చితంగా పాటించాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇళ్లు పొందిన లబ్ధిదారులు కూడా నెలకోసారి నిర్మాణ ప్రదేశాలను సందర్శించి తమ ఇళ్ల నిర్మాణ పురోగతిని ప్రత్యక్షంగా తెలుసుకునేలా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న సివిల్ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం నాగోలు బండ్లగూడలో జరుగుతున్న టవర్స్ పనులను కూడా పరిశీలించారు. అక్కడ చేపడుతున్న సిమెంట్ కాంక్రీట్ పనుల నాణ్యతను పరిశీలిస్తూ నిర్దేశించిన కాలపరిమితిలోగా నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్లకు గౌతం సూచించారు. ఆయన వెంట హౌసింగ్ బోర్డు చీఫ్ ఇంజనీర్ జి.వి రమణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాబూరావు తదితరులు ఉన్నారు.



ఉపాధి హామీ పనులకు పెరుగుతున్న కూలీల హాజరు

హైదరాబాద్, నవంబర్ 19:

రాష్ట్రంలో ఉపాధి హామీ పనులకు కూలీల హాజరు పెరుగుతోందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఈ నెల 18న ఒక్కరోజే ఆరు లక్షల మందికి పైగా పనులకు హాజరుకావడం నవంబర్‌లో అత్యధికమని వెల్లడించారు. బుధవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో రోజువారీ సగటు హాజరును గ్రామపంచాయతీకి 47 నుంచి 60 మందికి పెంచాలని అధికారులను ఆదేశించారు. ప్రతి 40 మంది కూలీలకు ఒక మేట్‌ను నియమించి, శిక్షణ పొందిన వారికి డిసెంబర్ 1 నుంచి బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో చెక్‌డ్యాంలు, ఊటకుంటల నిర్మాణానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. జలసిరి కింద 88,675 పనులు ప్రారంభం కాగా, 28,646 పూర్తయ్యాయని అధికారులు వివరించారు. మిగిలిన పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళా సంఘాల భవనాలు, గోదాములు, గ్రామీణ రహదారులు, పాఠశాలల ప్రహరీల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. చెరువులు, కాలువల్లో పూడికతీత, నీటి వనరుల పునరుద్ధరణ పనులను ఉపాధి హామీతో అనుసంధానించాలని చెప్పారు. మరోవైపు 4.70 లక్షల మహిళా సంఘాల్లో ఆరోగ్యం, పోషణ, ఆహారం, పారిశుద్ధ్యం తదితర 18 అంశాలపై నెలవారీ సమావేశాలు నిర్వహించేందుకు రూపొందించిన శిక్షణ సామగ్రిని మంత్రి ఆవిష్కరించారు.



రాబోయే ఎన్నికలకు సిద్ధమవ్వాలి

హైదరాబాద్, నవంబర్ 19:

రాబోయే ఎన్నికలకు సమన్వయంతో సిద్ధమవ్వడంతోపాటు, రాష్ట్రవ్యాప్తంగా పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ సంస్థాగత సమావేశం గురువారం జరిగింది. రామచందర్‌రావు అధ్యక్షతన రాష్ట్ర మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి ఆశిష్ షెలార్ సమక్షంలో జరిగిన ఈ భేటీలో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డితోపాటు వివిధ మోర్చాల రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో పార్టీ నాయకత్వానికి, వివిధ మోర్చాలకు మధ్య సమన్వయాన్ని మరింత పెంచడంపై నాయకులు సమావేశంలో చర్చించారు. అదేవిధంగా రాబోయే ఎన్నికల కార్యక్రమాల్లో అన్ని మోర్చాలు చురుగ్గా పాల్గొనేలా చూడటంపై దృష్టి సారించారు. పార్టీ కార్యక్రమాలతో పాటు కేంద్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు.

గడ్కరీతో రామచందర్‌రావు భేటీ

కాగా, ఇండియన్ రోడ్సు కాంగ్రెస్ (ఐఆర్‌సీ) సదస్సులో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు విచ్చేసిన కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడ ఎన్.రామచందర్ రావు హెచ్‌ఐసీసీ నోవోటెల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. వారిద్దరూ పలు విషయాలపై చర్చించుకున్నారు.





2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ

- **2034 నాటికి ట్రిలియన్ డాలర్ లక్ష్యం**
- **జాతీయ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతానికి పెంపు**
- **ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య అతిపెద్ద తయారీ కారిడార్**
- **రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి**
- **ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్, నవంబర్ 19:

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో గురువారం ప్రారంభమైన ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ 85వ వార్షిక సదస్సులో ఆయన మాట్లాడుతూ.. 2034 నాటికే ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ స్థాయికి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. దేశ జనాభాలో 2.5 శాతం ఉన్న తెలంగాణ జాతీయ జీడీపీలో ప్రస్తుతం 5 శాతం వాటా అందిస్తోందని, 2047 నాటికి దాన్ని 10 శాతానికి పెంచుతామని తెలిపారు. గొప్ప రహదారులే దేశాలను అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలుగా మారుస్తాయని పేర్కొన్నారు.

రాష్ట్రాన్ని మూడు ఆర్థిక జోన్లుగా అభివృద్ధి చేస్తున్నామని సీఎం వివరించారు. ఓఆర్ఆర్ పరిధిలోని హైదరాబాద్‌లో సేవల రంగానికి, ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్య తయారీ రంగానికి, ఆర్ఆర్ఆర్ వెలుపల వ్యవసాయ, అనుబంధ పరిశ్రమలకు ప్రాధాన్యమిస్తామన్నారు. రాష్ట్ర రహదారుల అభివృద్ధికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సహకరించాలని కోరారు. జాతీయ ప్రయోజనాలు, మౌలిక వసతుల కల్పనలో రాజకీయాలకు తావులేదని స్పష్టం చేశారు. వైద్య రంగంలో ఉస్మానియా, నిమ్స్, టిమ్స్, వరంగల్ ఆసుపత్రుల ద్వారా 8 వేల పడకలు అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు ప్రకటించి, పెట్టుబడిదారులను ఆహ్వానించారు.

ఓయాసిస్ ఫెర్టిలిటీ కేంద్రాల్లో అక్రమ అండాల సేకరణ

హైదరాబాద్, నవంబర్ 19:

ఫెర్టిలిటీ కేంద్రాల అక్రమ అండాల సేకరణ వ్యవహారంలో విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. ఓయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్ వైద్యుల పాత్రతోనే ఈ దందా సాగినట్లు పోలీసుల రిమాండ్ రిపోర్టులో వెల్లడైంది. ఒకే చోట అనుమతి తీసుకుని ఓయాసిస్, సద్గురు సంస్థలు మొత్తం 43 కేంద్రాలను నిర్వహించినట్లు దర్యాప్తులో గుర్తించారు.

బ్రోకర్లు ఇతర రాష్ట్రాల నుంచి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మహిళలను హైదరాబాద్‌కు తీసుకొచ్చి, ఒక్కో అండం దానానికి రూ.50 వేల వరకు ఆశ చూపినట్లు పోలీసులు తెలిపారు. బేగంపేటలోని అమీ నీతా గర్ల్స్ హాస్టల్‌లో ఉంచి, వైద్యుల పర్యవేక్షణ లేకుండానే హార్మోన్ ఇంజెక్షన్లు ఇచ్చినట్లు ఆరోపించారు. అక్కడ మందుల వైల్స్, ఉపయోగించిన ఇంజెక్షన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్, దిల్‌సుఖ్‌నగర్ కేంద్రాల్లో అండాలు సేకరించి ఐవీఎఫ్ చికిత్సకు వినియోగించినట్లు తేలింది. జనవరి నుంచి అక్టోబర్ వరకు 66 డోనర్ కేసులు నమోదైనా అధికారులకు 47 మంది వివరాలే అందించారు. మిగిలిన 19 మంది రికార్డులు కనిపించక పోవడం అనుమానాలకు తావిస్తోంది. బ్రోకర్లకు ఒక్కో డోనర్‌కు రూ.65 వేల వరకు చెల్లించేలా ఒప్పందాలు చేసుకున్నట్లు రిపోర్టులో పేర్కొన్నారు. సేకరించిన అండాలను గచ్చిబౌలి, ఉప్పల్, టోలిచౌకి, మలక్‌పేట కేంద్రాలకు తరలించారు. ఓయాసిస్ ఎండీ డాక్టర్ దుర్గారావు, బ్రోకర్లు అమిత్ శర్మ, నిఖత్ పర్వీన్ సహా పలువురు పరారీలో ఉన్నారు. మలక్‌పేట బ్రాంచ్ ఇన్‌చార్జ్ ఆనంద్‌రాజ్, అడ్మిన్ సుభానీ షేక్‌లను పోలీసులు అరెస్టు చేసి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపాలని కోర్టును కోరారు. బీఎన్ఎస్, ఏఆర్‌టీ చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



డ్రగ్స్ మహమ్మారిపై సమరశంఖం..

హైదరాబాద్, నవంబర్ 19:

యువత బంగారు భవిష్యత్తును చిదిమేస్తున్న మత్తుపదార్థాల మహమ్మారిని తరిమికొట్టేందుకు సినీ, రాజకీయ రంగాలు ఏకమవుతున్నాయి. కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అధ్వర్యంలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో హైదరాబాద్ మహానగరంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'నషా ముక్త్ భారత్ యాత్ర' (హైదరాబాద్ వాక్)కు ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ మహా ప్రజా ఉద్యమంలో భాగస్వాములు కావాలని నాగార్జునను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇద్దరూ కలిసి యాత్రకు సంబంధించిన టీషర్టులను ఆవిష్కరించారు.

సమాజాన్ని, ముఖ్యంగా యువత జీవితాలను నాశనం చేస్తున్న డ్రగ్స్ రక్కసిని అంతమొందించడం మనందరి సామాజిక బాధ్యతని అక్కినేని నాగార్జున అన్నారు. ఆరోగ్యకరమైన, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం జరిగే ఇలాంటి గొప్ప కార్యక్రమాలకు తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన "నషా ముక్త్ యువా ఫర్ వికసిత్ భారత్" పిలుపు మేరకు, 2029 నాటికి డ్రగ్స్ రహిత భారతదేశాన్ని నిర్మించాలన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా దృఢ సంకల్పంతో ఈ యాత్రను చేపడుతున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. భావితరాల భద్రత కోసం నిర్వహిస్తున్న ఈ మహా యజ్ఞంలో యువత, తల్లిదండ్రులు, నగర ప్రజలు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

స్టాలిన్‌ను ఓడించిన టీవీకే ఎమ్మెల్యే
వీఎస్ బాబు కన్నుమూత

- 75 ఏళ్ల వయసులో గుండెపోటుతో తుదిశ్వాస
- సెప్టెంబర్ 9 నుంచి ఆసుపత్రిలో చికిత్స
- కొలత్తూరులో స్టాలిన్‌పై 8,795 ఓట్ల మెజారిటీతో విజయం
- డీఎంకేతో రాజకీయ ప్రస్థానం.. అన్నాడీఎంకేలోనూ కొంతకాలం
- తమిళనాడు అసెంబ్లీలో ఖాళీల సంఖ్య ఆరుకు చేరిక



చెన్నై, నవంబర్ 19:

తమిళనాడు రాజకీయాల్లో విషాదం చోటుచేసుకుంది. కొలత్తూరు నియోజక వర్గంలో మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను ఓడించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఎమ్మెల్యే వీఎస్ బాబు (75) కన్నుమూశారు. శ్వాసకోశ సమస్యలతో సెప్టెంబర్ 9న చెన్నైలోని ఎంజీఎం హెల్త్‌కేర్ ఆసుపత్రిలో చేరిన ఆయన ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం విషమించడంతో గురువారం మధ్యాహ్నం 2.24 గంటలకు గుండెపోటుతో మరణించినట్లు ఆసుపత్రి వర్గాలు ప్రకటించాయి. డీఎంకేలో ఏరియా కార్యదర్శిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన బాబు 2006లో పురసవాక్కం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2011లో కొలత్తూరు నుంచి స్టాలిన్ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. అనంతరం డీఎంకేకు దూరమై 2016లో అన్నాడీఎంకేలో చేరారు. ఈ ఏడాది టీవీకేలో చేరి 2026 అసెంబ్లీ ఎన్నికల్లో కొలత్తూరు నుంచి పోటీ చేశారు. బాబుకు 82,997 ఓట్లు రాగా, స్టాలిన్‌కు 74,202 ఓట్లు వచ్చాయి.



దత్తత పిల్లలకు ప్రత్యేక గుర్తింపు వద్దు: కేరళ హైకోర్టు

- అధికారిక పత్రాల్లో 'దత్తపుత్రుడు, దత్తపుత్రిక' పదాల తొలగింపునకు ఆదేశం
- సొంత కుమారుడు, కుమార్తెగానే గుర్తించాలని స్పష్టీకరణ
- ఈ-డిస్ట్రిక్ట్ పోర్టల్‌లో నెల రోజుల్లో నిబంధనల మార్పు
- రెండు వారాల్లో పిటిషనర్‌కు కొత్త వారసత్వ ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని ఆదేశం

తిరువనంతపురం, నవంబర్ 19:

దత్తత తీసుకున్న పిల్లలను ప్రభుత్వ రికార్డుల్లో ప్రత్యేకంగా 'దత్తపుత్రుడు', 'దత్తపుత్రిక'గా పేర్కొనే విధానాన్ని తొలగించాలని కేరళ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. వారిని తల్లిదండ్రుల సొంత కుమారుడు, కుమార్తెగానే గుర్తించాలని జస్టిస్ పీవీ కున్ని కృష్ణన్ స్పష్టం చేశారు.
హిందూ దత్తత, మనోవర్తి చట్టం 1956లోని సెక్షన్ 12 ప్రకారం దత్తత తీసుకున్నప్పటి నుంచి పిల్లలకు సొంత సంతానంతో సమానమైన హక్కులు ఉంటాయని కోర్టు పేర్కొంది. అధికారిక పత్రాల్లో దత్తత అనే పదం ప్రస్తావించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. 1990లో నెల రోజుల వయసులో దత్తత తీసుకున్న తనను అన్ని ధ్రువపత్రాల్లో కుమార్తెగా పేర్కొన్నప్పటికీ, తండ్రి మరణానంతరం 2024లో జారీ చేసిన వారసత్వ పత్రంలో 'దత్తపుత్రిక'గా నమోదు చేయడాన్ని ఓ మహిళ కోర్టులో సవాలు చేశారు. ఈడిస్ట్రిక్ట్ పోర్టల్ నిబంధనల ప్రకారమే అలా పేర్కొన్నామన్న ప్రభుత్వ వాదనను న్యాయస్థానం తిరస్కరించింది. పిటిషనర్‌కు రెండు వారాల్లోగా 'కుమార్తె' అని పేర్కొంటూ కొత్త వారసత్వ పత్రం ఇవ్వాలని త్రిసూర్ తహసీల్దార్‌ను ఆదేశించింది. నెల రోజుల్లోగా ఈడిస్ట్రిక్ట్ పోర్టల్ నుంచి దత్తపుత్రుడు, దత్తపుత్రిక అనే ఆప్షన్లను తొలగించి నిబంధనలు సవరించాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది.

బీమా గడువు ముగిసిన వాహనాలకు జరిమానాలుండవు

- అవగాహన కోసమే ఎస్ఎంఎస్ హెచ్చరికలన్న ఎన్‌హెచ్ఏఐ

న్యూఢిల్లీ, నవంబర్ 19:




వాహన బీమా గడువు ముగియనున్న విషయాన్ని ముందుగానే గుర్తు చేస్తూ జాతీయ రహదారులపై ప్రయాణించే కొంతమంది వాహనదారులకు పంపిస్తున్న ఎస్ఎంఎస్ సందేశాలపై నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) స్పష్టత ఇచ్చింది. ఈ సందేశాలు కేవలం ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతిపాదించిన కార్యక్రమంలో భాగంగా ప్రయోగాత్మకంగా పంపిస్తున్నవేనని వెల్లడించింది. బీమా గడువు ముగిసిన వాహనాలకు టోల్ ప్లాజాల వద్ద ఎలాంటి చలాన్లు జారీ చేయడం లేదని, జరిమానాలు కూడా విధించడం లేదని స్పష్టం చేసింది. గురువారం కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల శాఖ ఈ విషయాన్ని ఓ ప్రకటనలో తెలిపింది. వాహన బీమా పాలసీల గడువు ముగిసే తేదీలను ముందుగానే వాహన యజమానులకు తెలియజేయడమే ఈ ఎస్ఎంఎస్ వ్యవస్థ ప్రధాన ఉద్దేశమని ఎన్‌హెచ్ఏఐ పేర్కొంది. బీమా గడువు ముగిసేలోపు పాలసీలను పునరుద్ధరించుకునేలా వాహనదారులను అప్రమత్తం చేయడం ద్వారా నిరంతర బీమా రక్షణను ప్రోత్సహించాలన్నది ఈ కార్యక్రమం లక్ష్యమని వివరించింది. ఈ సందేశాలకు టోల్ ప్లాజాల వద్ద అమలయ్యే ఎలాంటి ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలతోనూ సంబంధం లేదని పేర్కొంది. మోటారు వాహనాల బీమా గడువును సకాలంలో పునరుద్ధరించుకోవడం కూడా రహదారి భద్రతా నిబంధనల్లో భాగమేనని గుర్తు చేసింది.

పెట్టుబడుల నిర్ణయాల్లో 'ఇండియా ఫస్ట్'కు ప్రాధాన్యం: మోదీ

- రాబోయే 20 ఏళ్ల పెట్టుబడులకు ఇదే ప్రాతిపదిక కావాలి
- వ్యవసాయం, ఔషధ రంగాల్లో పెట్టుబడులు పెంచాలి
- దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలి
- పన్ను రాయితీల ప్రయోజనాలు ఉద్యోగులకూ అందాలి
- నాణ్యత పెంచి ప్రపంచ మార్కెట్లలో పోటీ పడాలి
- సంస్కరణలపై నేరుగా సూచనలు చేయాలని పరిశ్రమలకు పిలుపు

న్యూఢిల్లీ, నవంబర్ 19:

భారత్‌ను స్వయం సమృద్ధి దేశంగా తీర్చిదిద్దడంలో పరిశ్రమలు కీలక పాత్ర పోషించాలని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. రాబోయే 20 ఏళ్లలో ప్రతి దీర్ఘకాలిక పెట్టుబడి నిర్ణయం 'ఇండియా ఫస్ట్' ప్రాతిపదికగా ఉండాలని సూచించారు. దిల్లీలో జరిగిన ఫిక్కీ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో పెట్టుబడులు పెంచాలని, దేశాభివృద్ధికి అవసరమైన సంస్కరణలపై నేరుగా తనకు సూచనలు చేయాలని పరిశ్రమల ప్రతినిధులను కోరారు.
మహాత్మాగాంధీ వందేళ్ల క్రితమే స్వదేశీ ఉత్పత్తులు, స్వయం సమృద్ధి గురించి చెప్పారని గుర్తుచేసిన మోదీ.. దేశీయ వస్తువుల నాణ్యతను పెంచి అంతర్జాతీయ మార్కెట్లలో పోటీపడాలని సూచించారు. విదేశాల్లో భారత ఉత్పత్తులకు ఉన్న డిమాండ్‌ను గుర్తించి, అందుకు అనుగుణంగా రైతుల నుంచి పంటల సేకరణకు వ్యవస్థలు ఏర్పాటు చేయాలన్నారు. ఔషధాల తయారీలో ఉపయోగించే ఏపీఐలు, బల్క్ డ్రగ్స్ వంటి ముడి పదార్థాలను దేశీయంగా ఉత్పత్తి చేసి దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలని కోరారు.
కార్పొరేట్ పన్నును 30 నుంచి 22 శాతానికి తగ్గించామని, కొత్త పన్ను విధానంలో రూ.12 లక్షల వరకు ఆదాయానికి పన్ను మినహాయింపు కల్పించామని తెలిపారు. పన్ను రాయితీలతో పరిశ్రమలకు కలిగిన ప్రయోజనాలను ఉద్యోగుల సంఖ్య, వేతనాల పెంపు రూపంలో వారికి కూడా అందించారా అని ప్రశ్నించారు.
గత 1213 ఏళ్లలో సుమారు 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని ప్రపంచ బ్యాంకు నివేదికను ప్రస్తావించారు. అక్టోబర్‌లో వస్తు ఎగుమతులు 50 బిలియన్ డాలర్లకు చేరి రికార్డు సృష్టించాయని వెల్లడించారు. భారత్‌తో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా లభిస్తున్న అవకాశాలను పరిశ్రమలు వినియోగించుకోవాలని సూచించారు. దేశీయ వినియోగదారులకు కూడా ఎగుమతి ప్రమాణాలతో కూడిన నాణ్యమైన వస్తువులు అందించాలని స్పష్టం చేశారు.



'భారత్ 2047' ఇతివృత్తంతో జరిగిన ఈ సదస్సుకు పరిశ్రమల ప్రముఖులు, రాయబారులు, విధాన నిర్ణేతలు సహా 2,500 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. 1927లో ఏర్పాటైన ఫిక్కీ 2027 ఏప్రిల్ 7న వందేళ్లు పూర్తి చేసుకోనుంది.

ఎన్నికల సవాళ్లను ఎదుర్కొంటూ పోరాటం కొనసాగిస్తాం: రాహుల్

- ఎన్నికల లోపాల పేరుతో పోటీకి దూరమైతే ప్రజాస్వామ్యానికి ముప్పు
- చికాగో విశ్వవిద్యాలయ కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేత వ్యాఖ్యలు
- ప్రజాస్వామ్య హక్కులను మోదీ ప్రభుత్వం దెబ్బతీస్తోందని జైరాం రమేశ్ ఆరోపణ
- ధరల పెరుగుదల, నిరుద్యోగంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శ

న్యూఢిల్లీ, నవంబర్ 19:

భారత ప్రజాస్వామ్యంపై నమ్మకంతో ఎన్నికల్లో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ పోరాటం కొనసాగిస్తామని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థలో లోపాలు ఉన్నాయని పోటీకి దూరమైతే ప్రజాస్వామ్యానికి ముగింపు పలికినట్లేనని అన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా చికాగో విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజల ప్రజాస్వామ్య హక్కులను బలహీనపరుస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. పెద్ద నోట్ల రద్దును 'ఓటు బందీ'గా అభివర్ణించారు. ఓట్ల దొంగతనం కేవలం ఎన్నికల అక్రమాలకు సంబంధించిన అంశం కాదని, ప్రజల హక్కులు, గొంతుకపై జరుగుతున్న దాడి అని ఎక్స్ వేదికగా విమర్శించారు. పేదలు, కార్మికులు, రైతులు, యువత, మధ్యతరగతి ప్రజలకు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఓటే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు.
సామాన్యుల సమస్యల కంటే కార్పొరేట్ ప్రయోజనాలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని జైరాం రమేశ్ విమర్శించారు. ధరల పెరుగుదల ప్రజల పొదుపును దెబ్బతీస్తోందని, నిరుద్యోగం యువత భవిష్యత్తును ప్రభావితం చేస్తోందని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మార్పులు కార్మికుల ఉపాధి హక్కులపై ప్రభావం చూపుతున్నాయని ఆరోపించారు.



దావూద్ పాత నివాసం కూల్చివేతకు హైకోర్టు బ్రేక్

- భెండి బజార్‌లోని పాత భవనంపై బీఎంసీ బుల్డోజర్లు
- ప్రమాదకర భవనంగా గుర్తించి కూల్చివేత ప్రారంభం
- ఆస్తి వక్ఫ్‌కు చెందినదంటూ హైకోర్టును ఆశ్రయించిన ఇద్దరు
- తదుపరి విచారణ వరకు యథాతథ స్థితికి న్యాయస్థానం ఆదేశం
- నవంబర్ 25కు వాయిదా పడిన తదుపరి విచారణ

ముంబయి, నవంబర్ 19:

అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం కుటుంబం ఒకప్పుడు నివసించిన ముంబయిలోని పాత భవనం కూల్చివేతకు బాంబే హైకోర్టు తాత్కాలికంగా అడ్డుకట్ట వేసింది. భెండి బజార్‌లోని పక్కోడియా స్ట్రీట్‌లో ఉన్న హాజీ ఇస్మాయిల్ హాజీ హబీబ్ ముసాఫిర్‌ఖానా భవనాన్ని బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) అధికారులు గురువారం కూల్చడం ప్రారంభించారు. అయితే ఆస్తి హక్కులపై పిటిషన్లు దాఖలు కావడంతో న్యాయస్థానం జోక్యం చేసుకుంది. దావూద్ 1970వ దశకంలో తన కుటుంబంతో కలిసి ఈ భవనంలో నివసించాడు. 1986లో భారత్ విడిచివెళ్లే వరకు ఈ ప్రాంతం అతడి కార్యకలాపాలకు కేంద్రంగా ఉండేది. కాలక్రమంలో శిథిలావస్థకు చేరిన భవనాన్ని బీఎంసీ అధికారులు అత్యంత ప్రమాదకరమైన సీ1 కేటగిరీగా గుర్తించారు. దీంతో భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేత చేపట్టారు. అయితే ఈ భవనం హాజీ ఇస్మాయిల్ హాజీ హబీబ్ ముసాఫిర్‌ఖానా ట్రస్ట్‌కు చెందినదని, 1864లో హజ్ యాత్రికుల విశ్రాంతి భవనం, మసీదు నిర్మాణం కోసం కేటాయించిన వక్ఫ్ ఆస్తి అని ఇద్దరు పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. బీఎంసీ నోటీసులు, కూల్చివేత చర్యలు నిబంధనలకు విరుద్ధమని అభ్యంతరం వ్యక్తం చేశారు. భెండి బజార్ పునరాభివృద్ధి ప్రాజెక్టుతోనూ ఈ ఆస్తి వివాదానికి సంబంధం ఉంది. పిటిషన్లపై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మహేశ్ చంద్ర త్రిపాఠి, జస్టిస్ అద్వైత్ సేథ్నాతో కూడిన ధర్మాసనం తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు కూల్చివేత నిలిపివేయాలని ఆదేశించింది. నవంబర్ 25న తదుపరి విచారణ జరిగే వరకు భవనంపై యథాతథ స్థితి కొనసాగించాలని స్పష్టం చేసింది.



భారతీయులకు జనవరి 1 నుంచి
వీసా–ఫ్రీ ఎంట్రీ బంద్



సింగపూర్, నవంబర్19:

భారతీయ పౌరులకు కల్పిస్తున్న వీసా రహిత ప్రవేశ సౌకర్యాన్ని వచ్చే ఏడాది జనవరి 1 నుంచి రద్దు చేయనున్నట్లు మలేషియా ఇమిగ్రేషన్ విభాగం ప్రకటించింది. ఆగ్నేయాసియా దేశమైన మలేషియాకు ప్రయాణించే భారతీయులకు 30 రోజుల పాటు వీసా మినహాయింపు ఉండేది. ప్రయాణానికి మూడు రోజుల ముందుగా 'మలేషియా డిజిటల్ అరైవల్ కార్డ్'కోసం నమోదు చేసుకుంటే సరిపోయేది. ఈ వీసా మినహాయింపును 2023 డిసెంబర్ 1న ప్రవేశపెట్టారు, ఆ తర్వాత దీనిని 2026 చివరి వరకు పొడిగించారు. భారతీయులకు వీసా-ఫ్రీ ఎంట్రీ సదుపాయం 2027 జనవరి 1 నుంచి రద్దవుతుందని పేర్కొంటూ మలేషియా ఇమిగ్రేషన్ విభాగం ఈ నెల 17న నోటీసు జారీ చేసింది. ఇకపై మలేషియాకు వెళ్లే భారతీయ పౌరులు, అక్కడికి చేరుకోకముందే చెల్లుబాటు అయ్యే వీసాను పొందాల్సి ఉంటుంది.

డ్రగ్స్ రహిత భారత్‌ను నిర్మించాలి

- సమాజం, ఆధ్యాత్మిక సంస్థలు, విద్యా సంస్థలు చొరవ తీసుకోవాలి
- ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

న్యూఢిల్లీ, నవంబర్ 19:

: మాదకద్రవ్య రహిత భారతదేశాన్ని నిర్మించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. ఈ విషయంలో సమాజం, ఆధ్యాత్మిక సంస్థలు, విద్యా సంస్థల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచాలని పిలుపునిచ్చారు. ఆయా సంస్థలు చొరవ తీసుకోవాలని కోరారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా చేపట్టే కార్యక్రమాలు రొటీన్‌గా ఉండొద్దని, ప్రజలపై ప్రభావం చూపేలా రూపొందించాలని అన్నారు. మనుషుల్లో వైకల్యాలను ముందుగానే గుర్తించడంలో, వాటికి సంబంధించి సమాజంలో ఉన్న వివక్షను అధిగమించడంలో ప్రజల భాగస్వామ్యం ఉండాలని పేర్కొన్నారు. గురువారం సామాజిక న్యాయం, సాధికారతపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో మోదీ మాట్లాడారు. ప్రజలకు అవసరమైన సాంకేతికతలను చౌకగా రూపొందించడానికి స్టార్టప్‌లను ప్రోత్సహించాలని స్పష్టంచేశారు. నషా ముక్త్ భారత్ దిశగా సమాజం మొత్తం పాలుపంచుకోవాలని విన్నవించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టుచేశారు. ఈ శిఖరాగ్ర సమావేశంలో జరిగిన చర్చలు, కార్యాచరణ అంశాలు కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడి లక్ష్యస్ఫూర్తిని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. ఒకరి అనుభవాలు, ఆవిష్కరణల నుంచి మరొకరు నేర్చుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. సంకోచం, అవగాహన లోపం వంటి కారణాల వల్ల తల్లిదండ్రులు తరచుగా తమ పిల్లల్లోని సమస్యలను గుర్తించలేకపోతున్నారని, దానివల్ల పిల్లలు సకాలంలో సహాయం పొందలేకపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ పరిస్థితిలో తప్పని సరిగా మార్పు రావాలని ప్రధానమంత్రి తేలీచ్ చెప్పారు.



గ్రాషా మషెల్‌కు ఇందిర శాంతి పురస్కారం

న్యూఢిల్లీ, నవంబర్ 19:

ఇందిరా గాంధీ శాంతి, నిరాయుధీకరణ, అభివృద్ధి పురస్కారాన్ని మొజాంబిక్ నాయకురాలు గ్రాషా మషెల్ అందుకున్నారు. ఢిల్లీలోని జవహర్ భవన్‌లో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో గ్రాషా మషెల్‌కు కాంగ్రెస్ అగ్ర నేత, ఇందిరా గాంధీ మెమోరియల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ప్రదానం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా మహిళలు, చిన్నారుల హక్కుల పరిరక్షణ కోసం పాటుపడుతున్నందుకుగాను గ్రాషా మషెల్‌కు ఈ అవార్డు కింద ప్రశంసా పత్రంతోపాటు రూ.కోటి నగదును అందజేశారు. అన్యాయాన్ని ఎదుర్కొనే ధైర్యం, మార్పు తీసుకురావాలనే సంకల్ప బలం ఆధారంగానే నాయకత్వ పటిమను అంచనా వేయగలమని ఇందిరా గాంధీ వంటివారి జీవితాలు మనకు గుర్తుచేస్తాయని ఈ సందర్భంగా సోనియా తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, శివశంకర్ మీనన్ పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన దుబ్బాక మైనారిటీ గురుకుల విద్యార్థి



దుబ్బాక ప్రతినిధి నవంబర్ 19, :

ఎస్జీఎఫ్ మండల స్థాయి, జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన చేసి గురువారం ఉమ్మడి మెదక్ జిల్లా సెలక్షన్స్ లో అత్యుత్తమ ప్రదర్శన చేసి రాష్ట్ర స్థాయికి క్రీడలకు ఎంపికైనటువంటి దుబ్బాక మైనార్టీ గురుకుల విద్యార్థి సిహెచ్ రామ్ చరణ్. ఈనెల 22న వరంగల్ జిల్లా తొర్రూరులో జరిగే రాష్ట్ర స్థాయిలో క్రీడలలో పాల్గొంటాడు. రామ్ చరణ్ మంచి క్రమశిక్షణతో చదువుతో పాటు క్రీడల్లో రాణించడం చాలా గర్వంగా ఉందని ప్రిన్సిపాల్ విమలా రెడ్డి, డిప్యూటీ వార్డెన్ హమీద్, పిడి షాదుల్, అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

నీతికి మారుపేరు చెరుకు ముత్యంరెడ్డి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 19, :

స్వర్గీయ మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి నిజంగానే నీతికి, నిజాయితీకి నిలువెత్తు అద్దమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రశంసించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ముత్యంరెడ్డిని గుర్తు చేసి పై విధంగా అన్నారు. ప్రజల కోసం ఎంతో శ్రమించి, ఆస్తులు పోగొట్టుకుని, సర్వం త్యాగం చేసిన గొప్ప నాయకుడు ముత్యం రెడ్డి అని కొనియాడారు. కేసీఆర్, ముత్యం రెడ్డిలు ఇద్దరూ ఒకేసారి రాజకీయాలు మొదలుపెట్టినా, ముత్యంరెడ్డి ముందుగా మంత్రి అయ్యారని తెలిపారు. కానీ కాలక్రమేణా రాజకీయాల్లో ఎవరి పరిస్థితి ఎట్లా మారిందో ప్రజలు ఆలోచించాల్సిన విషయమని పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబం పరిస్థితిని, ముత్యం రెడ్డి కుటుంబం పరిస్థితిని ఒకసారి బేరీజు వేసుకొని ఆలోచించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "సిద్దిపేట-దుబ్బాక" బంధం "హైదరాబాద్-సికింద్రాబాద్" జంట నగరాల్లాగే సిద్దిపేట, దుబ్బాక కూడా అంతే దగ్గరగా ఉంటాయని తెలిపారు. మొదటి తరం నాయకుల ప్రస్థానం చూస్తే చాలా విషయాలు అర్థమవుతాయని, గతాన్ని ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటే, నిజాయితీగా పనిచేసిన వాళ్ల పరిస్థితి ఏంటి, రాజకీయంగా ఎదిగిన వాళ్ల పరిస్థితి ఏంటి అనేది స్పష్టంగా తెలుస్తుందని స్పష్టం చేశారు. సిద్దిపేట సభలో సీఎం రేవంత్ రెడ్డి తమ అభిమాన నాయకుడు స్వర్గీయ ముత్యంరెడ్డి సేవలను గుర్తు చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు.

అయ్యప్ప మహా పడిపూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 19, :

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గాజులరామారం డివిజన్ ఉషోదయ కాలనీ, సుభాష్ నగర్ డివిజన్ ఎస్.ఆర్. నాయక్ నగర్‌లో గురువారం నిర్వహించిన అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. భక్తి, ఆధ్యాత్మికతతో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో పడిపూజ నిర్వాహకులు సురేందర్ రెడ్డి, యేసుబాబుతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, వెంకన్న, అయ్యప్ప సేవా సమితి సభ్యులు, అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా కళ్యాణ మహోత్సవం

స్వామివారి సేవలో దొడ్ల వెంకటేష్ గౌడ్



కూకట్పల్లి ప్రతినిధి, నవంబర్ 19, :

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేజ్-2లో కొలువై ఉన్న భ్రమరాంబా మల్లికార్జున స్వామి దేవాలయం 17వ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం సీతారాముల, శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, భాస్కర్ రెడ్డి, శివరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లు దాటినా పూర్తికాని అల్వాల హైలెవల్ బ్రిడ్జి

రూ.4 కోట్లు మంజూరైనా పిల్లర్లకే పరిమితమైన నిర్మాణం

- వర్షా కాలంలో పాత బ్రిడ్జిపైనే ప్రయాణం.. ప్రమాదాల భయంతో ప్రజలు..
- భూ వివాదం పరిష్కరించి పనులు పూర్తి చేయాలని స్థానికుల డిమాండ్



దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి), నవంబర్ 19, :

నిధులు మంజూరయ్యాయి.. శంకుస్థాపన జరిగింది.. పనులు ప్రారంభమయ్యాయి.. కానీ ప్రజలకు మాత్రం వంతెన అందుబాటులోకి రాలేదు.. పదేళ్లు గడుస్తున్నా నిర్మాణం పూర్తి కాకపోవడంతో అల్వాల గ్రామ శివారులోని కూడవెల్లి వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం నిరుపయోగంగా మారింది. పిల్లర్ల దశలోనే పనులు నిలిచిపోవడంతో స్థానికులు, వాహనదారులు ఇప్పటికీ పాత బ్రిడ్జిపైనే రాకపోకలు సాగిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామ శివారులో కూడవెల్లి వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి 2015లో ఆర్అండ్బీ శాఖ ద్వారా రూ.4 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. అప్పటి మంత్రి తన్నీరు హరీశ్‌రావు చేతుల మీదుగా నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అయితే, నిర్మాణానికి సంబంధించి భూ వివాదం తలెత్తడంతో పనులు పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయి. అప్పటి నుంచి నేటి వరకు సమస్య పరిష్కారం కాకపోవడంతో బ్రిడ్జి నిర్మాణం ముందుకు సాగడం లేదు.

వర్షా కాలంలో తప్పని ప్రయాణ కష్టాలు

కొత్త బ్రిడ్జి నిర్మాణం పూర్తికాక పోవడంతో శిథిలావస్థకు చేరిన పాత బ్రిడ్జిపైనే ప్రజలు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ముఖ్యంగా వర్షాకాలంలో కూడవెల్లి వాగు ఉధృతంగా ప్రవహించే సమయంలో ప్రయాణం మరింత ఇబ్బందికరంగా మారుతోంది. వాగు ప్రవాహం పెరిగినప్పుడు రాకపో కలకు అంతరాయం ఏర్పడుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రజలకు కీలకమైన రహదారిపై బ్రిడ్జి నిర్మాణం పదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉండటం స్థానికుల్లో అసంతృప్తికి కారణ మవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భూ వివాదాన్ని పరిష్కరించి, నిలిచిపోయిన నిర్మాణ పనులను పునఃప్రారంభించాలని, హైలె వల్ బ్రిడ్జిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సమీప గ్రామాల ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.





సీఎం పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలు, కాంట్రాక్టు ఉద్యోగుల అరెస్టు

- ప్రతిపక్ష నేతలను అక్రమంగా అరెస్టు చేయడం హేయమైన చర్య: బీఆర్ఎస్ నేతలు



దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి), నవంబర్ 19, :

రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా విమర్శించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ముందస్తుగా బీఆర్ఎస్ నాయకులతో పాటు కాంట్రాక్టు ఉద్యోగులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కాంట్రాక్టు ఉద్యోగులను ఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హక్కుల సాధన కోసం, ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం హేయమైన చర్యని వారు మండిపడ్డారు. పోలీసులను అడ్డుపెట్టుకుని ముఖ్యమంత్రి పర్యటనలు నిర్వహించడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతులను అణచివేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. తమ హక్కుల కోసం నిలదీస్తే అరెస్టులు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. పోలీసుల అదుపులో ధర్మారం సర్పంచ్ శ్రీనివాస్, కాంట్రాక్టు ఉద్యోగి మహేష్, బీఆర్ఎస్ నాయకులు పంజాల శ్రీనివాస్ గౌడ్, ఐలయ్య, హరికృష్ణ రెడ్డి, దిలీప్ రెడ్డి, హైమద్, సురేందర్ తదితరులు ఉన్నారు.

ఢిల్లీలో జాతీయ పురస్కారం అందుకున్న ఏవీ బాలేశం

- విద్య సేవా రంగాల్లో విశేష కృషికి పురస్కారం



దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 19, :

సిద్దిపేట జిల్లాకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ధర్మప్రచార పరిషత్ కార్యకర్త, వయోవృద్ధుల సేవా సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు ఏవీ బాలేశం విద్యారంగం, ఆధ్యాత్మిక సేవ, సామాజిక సంక్షేమం, వయోవృద్ధుల హక్కుల పరిరక్షణకు అందించిన విశేష సేవలకు గుర్తింపుగా ఢిల్లీలో జాతీయ స్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. నవంబర్ 15న ఢిల్లీలో నిర్వహించిన జాతీయ పురస్కార ప్రదానోత్సవంలో భారత ప్రభుత్వ కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ కమిషనర్ సుధారాణి రేలంగి, కరోల్ బాగ్ ఎమ్మెల్యే రవి, బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ ప్రముఖుల చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు. 1969 నుంచి ఉపాధ్యాయుడిగా విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణానికి కృషి చేసిన బాలేశం, 2006లో ఉద్యోగ విరమణ అనంతరం కూడా ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా వయోవృద్ధుల హక్కులు, సంక్షేమం, గౌరవప్రదమైన జీవనం కోసం చేస్తున్న సేవలకు తెలంగాణ ప్రభుత్వం 2026లో సేవారత్న అవార్డుతో సత్కరించింది. తాజాగా ఢిల్లీలో జాతీయ స్థాయి పురస్కారం అందుకోవడం పట్ల సిద్దిపేట జిల్లా గ్రామం దుంపలపల్లికి చెందిన పలువురు ఉపాధ్యాయులు, సేవా సంస్థల ప్రతినిధులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

దివంగత ప్రధాని ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

- రాజకీయ లబ్ధి కోసం చరిత్రను తప్పుదోవ పట్టిస్తున్న బీజేపీ
- దేశం కోసం ప్రాణాలర్పించిన దివంగత ప్రధాని ఇందిరాగాంధీ
- మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



గజ్వేల్ ప్రతినిధి, నవంబర్ 19, :

దేశం కోసం ప్రాణాలర్పించిన దివంగత ప్రధాని ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. దివంగత ఇందిరా గాంధీ జయంతి వేడుకలు గజ్వేల్ లో గురువారం కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి నాయిని యాదగిరి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, పీసీసీ నాయకులు నాయిని యాదగిరి, మండల పార్టీ బాధ్యులు సుఖేందర్ రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు కొండల్ రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు షరీఫ్, సీనియర్ నేత నక్క రేగొండ గౌడ్, మజీద్ కమిటీ చైర్మన్ మతిన్, కౌన్సిలర్లు గుగ్లోతు రమేష్, గుంటుకు శ్రీనివాస్, నక్క రాములు గౌడ్ లతో కలిసి ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో నెహ్రూ, గాంధీల కుటుంబం ఎనలేని సేవలుందించగా రాజకీయ లబ్ధి కోసం ప్రధాని నరేంద్ర మోడీ చరిత్రను తప్పుదోవ పట్టిస్తూ పబ్బం గడుపుతున్నట్లు ఎద్దేవా చేశారు. దేశ ప్రజల కోసం ప్రాణాలు అర్పించిన దివంగత ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ సేవలు ఎన్నటికీ మరిచిపోరని, అయితే మతాలు, కులాలు, ప్రాంతాలుగా విభజిస్తూ రాజకీయ లబ్ధికి చరిత్రను తప్పుదోవ పట్టిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ కొత్త కథలకు తెరలేపుతున్నట్లు విమర్శించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో బీజేపీ అసలు పుట్టనేలేదని గుర్తు చేశారు. ప్రపంచంలోనే దివంగత ఇందిర అత్యంత శక్తివంతమైన మహిళగా గుర్తింపు పొందగా, శత్రు దేశాలను గడగడలాడించిన ఆమె ఘన చరిత్ర ఎవరు కాదనలేని సత్యమని తెలిపారు. ఇందిరాగాంధీ పోరాట పటిమ, సేవలను ప్రపంచ దేశాలు గుర్తించగా, ఉక్కు మహిళగా ప్రశంసలందుకున్నట్లు చెప్పారు. గరిబీ హఠావో, బ్యాంకుల జాతీయకరణ, 20 సూత్రాల పథకం, రాజభరణాల రద్దు తదితర అమలుతో పేదల జీవితాలలో ఆమె చిరస్థాయిగా నిలిచిందని అన్నారు. అద్భుతమైన పాలనతో ప్రపంచ దేశాల మన్ననలు పొందిన దివంగత ఇందిర నేటితరం యువతకు ఆదర్శమని, అలాగే దేశ ప్రజలతో ఆ కుటుంబానికి విడదీయరాని బంధం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యమానికి ఊపిరి పోసిన కొట్టాల యాదగిరిని విమర్శించడం సిగ్గుచేటు

- కేసీఆర్ గెలుపు కోసం అహర్నిశలు శ్రమించిన నాయకుడిపై విమర్శలా
- ఉద్యమ ద్రోహుల చేతుల్లో గజ్వేల్ బీఆర్ఎస్.. నిజమైన కార్యకర్తలకు అన్యాయం..
- తెలంగాణ రక్షణ సేనలో ఉద్యమకారులకు సముచిత స్థానం



గజ్వేల్ ప్రతినిధి, నవంబర్ 19, :
తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేసిన కొట్టాల యాదగిరి ముదిరాజ్‌ను విమర్శించడం సిగ్గుచేటని మాజీ ఎంపీటీసీ ఎడ్ల నర్సింలు, టీఆర్ఎస్ పట్టణ యువజన విభాగం అధ్యక్షులు కూరాకుల శ్రీకాంత్, ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగని రాజు, నాయకులు స్వామి, సుధాకర్, రాజలింగం మండిపడ్డారు. గురువారం గజ్వేల్ లో స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ గజ్వేల్ బీఆర్ఎస్ లో నేడు ఉద్యమ స్ఫూర్తి కనుమరుగవుతోందని, ఉద్యమ కాలం నుంచి పార్టీ కోసం పనిచేసిన నిజమైన కార్యకర్తలకు తగిన గుర్తింపు, గౌరవం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు పార్టీకి వ్యతిరేకంగా ఉన్నవారికే నేడు పదవులు దక్కుతున్నాయని, దీంతో అసలైన ఉద్యమకారులు, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు తీవ్ర నిరాశకు గురవుతున్నారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గెలుపు కోసం కొట్టాల యాదగిరి చేసిన కృషిని విస్మరించడం తగదన్నారు. కేసీఆర్‌తో కలిసి మూడుసార్లు నామినేషన్ కార్యక్రమాల్లో పాల్గొన్నారని, ముదిరాజ్ సామాజిక వర్గ సభలను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఉద్యమ సమయంలోనూ పార్టీ కష్టకాలంలోనూ అంకితభావంతో పనిచేసిన నాయకుడిపై నేడు విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గజ్వేల్‌లో బీఆర్ఎస్ నాటి వైభవాన్ని కోల్పోతుండటంతో నిజమైన కార్యకర్తల కళ్లలో కన్నీళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విమర్శలు చేస్తున్న నాయకులు ఐదేళ్ల క్రితం ఏ పార్టీలో ఉన్నారో గజ్వేల్ ప్రజలకు బాగా తెలుసన్నారు. ఉద్యమంలో భాగస్వామ్యం కానివారు నేడు ఉద్యమకారుల చిత్తశుద్ధిని ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ రక్షణ సేనలో అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నిజమైన తెలంగాణ ఉద్యమకారులకు, పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసిన నాయకులకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. కొట్టాల యాదగిరికి ఉద్యమ నేపథ్యం, ప్రజలతో ఉన్న అనుబంధం, మచ్చలేని రాజకీయ ప్రస్థానాన్ని గుర్తించినందునే రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించడంతో పాటు గజ్వేల్ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారని వివరించారు. ఉన్నత విద్యావంతుడిగా, ఉద్యమకారుడిగా, ప్రజాసేవకుడిగా గుర్తింపు పొందిన కొట్టాల యాదగిరిపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. రాజకీయాల్లో విమర్శలకు హద్దులు ఉండాలని, ఉద్యమ చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ప్రజలు సహించరని హెచ్చరించారు. ఇప్పటికైనా నీతిమాలిన రాజకీయాలకు స్వస్తి పలికి, నిజమైన ఉద్యమకారులకు గౌరవం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ కోర్టుల ఏర్పాటుకు కృషి చేసిన బక్కి వెంకటయ్యకు సన్మానం

- మాజీ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు దళిత సంఘాల నాయకుల సన్మానం



దుబ్బాక ప్రతినిధి (అక్బర్‌పేట-భూంపల్లి), నవంబర్ 19, :
రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కేసుల సత్వర పరిష్కారం కోసం ప్రత్యేక కోర్టుల ఏర్పాటుకు కృషి చేసిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ బక్కి వెంకటయ్యను గురువారం అక్బర్‌పేట–భూంపల్లిలో దళిత సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. గతంలో ఉమ్మడి పది జిల్లాల పరిధిలోనే కేసుల విచారణ జరుగుతుండగా, కొత్త జిల్లాల ఏర్పాటుతో బాధితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యను గుర్తించిన బక్కి వెంకటయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన హైపవర్ కమిటీ సమావేశంలో ప్రతి జిల్లాలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. ఆయన కృషితో రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 59 ద్వారా 33 ప్రత్యేక కోర్టుల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమన్నారు. ప్రత్యేక కోర్టులతో కేసుల విచారణ వేగవంతమై బాధితులకు సత్వర న్యాయం అందుతుందని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, బక్కి వెంకటయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాల జేఏసీ జిల్లా చైర్మన్ ఆస లక్ష్మణ్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పెద్ద లింగన్నగారి శంకర్, సీనియర్ జర్నలిస్ట్ బండ నర్సింహులు, ఆస బాబు, తౌడ శ్రీనివాస్, జక్కుల రాజయ్య, కనకయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు సమైక్య భవనాలు బాసట

ఎమ్మెల్యే జారె ఆదినారాయణ


దమ్మపేట, నవంబర్ 19, :
మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది స్వయం సమృద్ధి సాధించేందుకు మహిళా సమైక్య భవనాలు ఎంతగానో దోహదపడతాయని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. దమ్మపేట మండలంలోని గండుగులపల్లి, రెడ్యాలపాడు, శ్రీరామపురం, మారప్పగూడెం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన మహిళా సమైక్య భవనాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళలకు ఈ భవనాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. మహిళా సంఘాల సమావేశాలు, పొదుపు, రుణాల పంపిణీ, స్వయం ఉపాధి కార్యక్రమాలతో పాటు ఇతర సంఘ కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు ఈ భవనాలు శాశ్వత వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి కుటుంబ అభివృద్ధితో పాటు గ్రామాల అభ్యున్నతిలో కీలక భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్ రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ శ్రీధర్, వెలుగు సీసీ సంతోష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కూరం సత్యవతి, కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాద్, మద్దిశెట్టి సత్యప్రసాద్, ఎర్రా వసంతం, మాజీ ఎంపీపీ సోయం ప్రసాద్, ఎర్రగొర్ల రాధాకృష్ణ, మడకం రాజేష్, సోయం దావీద్, సర్పంచులు మెచ్చు ఈదప్ప, పూచి నాగ సులోచన, పూనెం



వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయడమే నా లక్ష్యం.. నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు!

- బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 19, :
కార్మికులకు ఎలాంటి అన్యాయం జరిగినా చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని, ప్రతి కార్మికుడికి న్యాయం జరిగే వరకు పోరాడుతానని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి స్పష్టం చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గాంధీనగర్ ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న ఓ కంపెనీలో అప్సర్ హుస్సేన్ అనే కార్మికుడు గత కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. అయితే, సదరు కంపెనీ యాజమాన్యం ఆయనకు రావాల్సిన ఒక నెల వేతనం రూ.18,000తో పాటు గ్రాట్యుటీ కలిపి మొత్తం రూ.54,000 చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేసినట్లు బాధిత కార్మికుడు తెలిపాడు. పలుమార్లు యాజమాన్యాన్ని సంప్రదించినప్పటికీ స్పందన లేకపోవడంతో విసుగు చెందిన కార్మికుడు విధులకు దూరమయ్యాడు. తనకు జరిగిన అన్యాయంపై న్యాయం కోసం తోటి కార్మికుల ద్వారా బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు రవి గురించి తెలుసుకున్న అప్సర్ హుస్సేన్, ఆయన కార్యాలయాన్ని సంప్రదించి తన సమస్యను వివరించాడు. విషయాన్ని తెలుసుకున్న రవి వెంటనే స్పందించి, హుటాహుటిన కంపెనీ వద్దకు చేరుకుని యాజమాన్యంతో పలుమార్లు చర్చలు జరిపారు. దీంతో స్పందించిన కంపెనీ యాజమాన్యం కార్మికుడు అప్సర్ హుస్సేన్‌కు రావాల్సిన వేతనం, గ్రాట్యుటీ కలిపి మొత్తం రూ.54,000ను చెక్కు రూపంలో అందజేసింది. ఈ సందర్భంగా బాధిత కార్మికుడు అప్సర్ హుస్సేన్ మాట్లాడుతూ.. నేటి రోజుల్లోనూ కార్మికులకు అండగా నిలుస్తూ, వారికి న్యాయం చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్న కార్మిక నాయకుడు రవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు రావాల్సిన బకాయిలను ఇప్పించడంలో చొరవ చూపినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. కార్మికుల హక్కులను కాపాడటమే తన ప్రధాన లక్ష్యమని, ఏ కార్మికుడికి అన్యాయం జరిగినా తాను అండగా నిలుస్తానని పేర్కొన్నారు. కార్మికుల పట్ల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, జగన్, సుదర్శన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కోటి దీపాల వెలుగుల్లో గాజులరామారం

- కనువిందు చేసిన ఆధ్యాత్మిక వేడుక
- కోటి దీపోత్సవంలో ముఖ్య అతిథిగా జనసేన నేత ముమ్మారెడ్డి ప్రేమ కుమార్



కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 19, :
భక్తి పారవశ్యం.. దీపాల వెలుగులు.. ఆధ్యాత్మిక శోభతో గాజులరామారం పులకించింది. నకులేశ్వరీ దేవి సిద్ధిపీఠం 27 నక్షత్ర వనాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన కోటి దీపోత్సవం కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. సోనేనా రవికుమార్ ఆహ్వానం మేరకు జనసేన పార్టీ రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రైమ్ 9 పొలిటికల్ అడ్వైజర్ డి వి వి సత్యనారాయణ కూడా హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ, కోటి దీపోత్సవాన్ని ఇంతటి వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రజల్లో భక్తిభావం, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అనంతరం నిర్వాహకులు ప్రేమ కుమార్‌ను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, పోలెబోయిన శ్రీనివాస గోవిందా తదితరులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సాయిబాబా నగర్‌లో సీఎం రేవంత్ రెడ్డికి ఘనంగా పాలాభిషేకం

నూతన పెన్షన్ల మంజూరీతో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 19, :
సాయిబాబా నగర్ డివిజన్ పరిధిలోని లాస్ట్ బస్ స్టాప్ వద్ద అర్హులైన పేదలకు నూతన పెన్షన్లు మంజూరు కావడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గురువారం సంబరాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం నిర్వహించి తమ హర్షాతిరేకాలను వ్యక్తం చేశారు. నూతనంగా పెన్షన్లు మంజూరు చేయడం పట్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అర్హులైన పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వారి జీవితాలకు భరోసానిస్తున్నాయని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి, శ్యామ్, సత్తిరెడ్డి, గణేష్, కుమారి, రేఖ, వరలక్ష్మి , శివ, సందీప్, సాయి, రిజ్వాన్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెన్షన్ లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

అయ్యప్ప స్వామి మహాపడి పూజ మహోత్సవంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు నరేందర్ రెడ్డి



కుత్బుల్లాపూర్, నవంబర్ 19, : బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కన్నెస్వామి స్వగృహంలో గురువారం నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి మహాపడి పూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఈ పవిత్ర ఆధ్యాత్మిక కార్యక్రమానికి జీడిమెట్ల 132వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శంభీపూర్ రాజు, శాసనమండలి ప్రతిపక్ష నాయకులు, ఎమ్మెల్సీ మధుసూదనాచారితో కలిసి మహాపడి పూజలో పాల్గొని అయ్యప్ప స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో రామచంద్రారెడ్డి, రమణారావు, రాంరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తుల మధ్య ఉత్సాహంగా కొనసాగింది.

ఇందిరమ్మకు ఘన నివాళి

- కూకట్‌పల్లిలో ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు.. పలు ప్రాంతాల్లో నివాళులర్పించిన బండి రమేష్.



కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 19,:
మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళ, భారతరత్న స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి వేడుకలను గురువారం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అల్లాపూర్ డివిజన్‌లో డివిజన్ అధ్యక్షుడు వాజిద్ పాషా ఆధ్వర్యంలో, మూసాపేట్ విలేజ్ సమీపంలో డివిజన్ అధ్యక్షుడు సంతోష్ ఆధ్వర్యంలో, ఐజీ పురంలో అజీజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో బండి రమేష్ పాల్గొని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రిగా ఇందిరాగాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. దేశ సమగ్రత, సమైక్యత, పేద ప్రజల సంక్షేమం కోసం ఆమె తీసుకున్న నిర్ణయాలు చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయని పేర్కొన్నారు. బ్యాంకుల జాతీయీకరణ, పేదరిక నిర్మూలన వంటి కార్యక్రమాల ద్వారా దేశ అభివృద్ధికి ఆమె చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని తెలిపారు.ఇందిరాగాంధీ ఆశయాలు, ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని కాంగ్రెస్ పార్టీ ప్రజాసేవలో ముందుకు సాగుతుందని బండి రమేష్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, యువజన నాయకులు, మహిళా నాయకురాళ్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన శ్రీహరి నగర్

- కన్నెస్వామి పడిపూజలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు గురుస్వామి

కూకట్పల్లి ప్రతినిధి, నవంబర్ 19, :

ఖైతాలపూర్ డివిజన్ పరిధిలోని శ్రీహరి నగర్‌లో గురువారం యేరపత్ని ధనరాజు, మోహన్ రావు స్వాముల ఆధ్వర్యంలో కన్నెస్వామి పడిపూజ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గురుస్వామి హరిణాథ్ రెడ్డి కరకమల ములచే నిర్వహించిన ఈ పవిత్ర కార్యక్రమానికి నిర్వాహకుల ఆహ్వానం మేరకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు గురుస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొని అయ్యప్ప స్వామి ఆశీస్సులు పొందారు. అనంతరం పడిపూజ నిర్వాహకులు ధనరాజు, మోహన్ రావు స్వాములు వడ్డేపల్లి రాజేశ్వరరావు గురుస్వామి ని శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఖైతాలపూర్ డివిజన్ అధ్యక్షులు తిరుపతిరెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి కోడిచెర్ల వినోద్, అయ్యప్ప స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ హామీలను వెంటనే అమలు చేయాలి

- లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా మరో ఉద్యమం తప్పదు
- టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గాడిపల్లి తిరుపతిరెడ్డి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 19, :

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో మరో పోరాటానికి సిద్ధం కావాల్సి వస్తుందని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గాడిపల్లి తిరుపతిరెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా శాఖ కమిటీ సమావేశం గురువారం జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయ భవన్‌లో జిల్లా అధ్యక్షులు అమ్మన నర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన



తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం జాప్యం చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే 51 శాతం ఫిట్‌మెంట్‌తో నూతన వేతన సవరణ సంఘం (పీఆర్సీ)ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం (డీఏ) బకాయిలను వెంటనే విడుదల చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆరోగ్య భద్రత కోసం హెల్త్ కార్డులను అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో, అన్ని రకాల వ్యాధులకు వర్తింపజేయాలని కోరారు. పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించడంతోపాటు పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు రావాల్సిన రిటైర్మెంట్ ప్రయోజనాలను ఎలాంటి జాప్యం లేకుండా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) ఆధ్వర్యంలో మరో ఉద్యమానికి సిద్ధం కావాలని ఉపాధ్యాయులకు పిలుపు నిచ్చారు. హక్కుల సాధన కోసం ఉపాధ్యాయులంతా ఐక్యంగా ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్, రాష్ట్ర కౌన్సిలర్లు విజేందర్ రెడ్డి, జమీర్ మోహియొద్దీన్, గంగా భవాని, రాంరెడ్డి, విద్యారాణి, జిల్లా ఉపాధ్యక్షులు మల్లేశం, పాపిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సుశీల, సత్యకృష్ణ, శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు శివాజీ, కొండల్ రెడ్డి, నర్సింలు గౌడ్, శ్రీలత, మహేందర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు మహిళ ఇందిరా గాంధీకి ఘన నివాళి

- దేశాభివృద్ధిలో ఆమె సేవలు, ధైర్యసాహసాలు చిరస్మరణీయం : కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 19, :

భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి, మాజీ ప్రధాని, ఉక్కు మహిళ శ్రీమతి ఇందిరా గాంధీ 109వ జయంతి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గురువారం బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో డీసీసీ కమిటీ సభ్యులు, వివిధ విభాగాల అధ్యక్షులు, మహిళా నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఇందిరా గాంధీ దేశానికి అందించిన సేవలను, ఆమె ధైర్యసాహసాలను, దేశ సమగ్రత, అభివృద్ధి కోసం చేసిన కృషిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భారత రాజకీయ చరిత్రలో ఇందిరా గాంధీది చెరగని ముద్ర అని, దేశ తొలి మహిళా ప్రధానమంత్రిగా ఎన్నో కీలక బాధ్యతలు చేపట్టి అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, జాతీయ సమగ్రత వంటి అంశాల్లో ఆమె తీసుకున్న నిర్ణయాలు భారత చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయని గుర్తు చేసుకున్నారు. మహిళా



నాయకత్వానికి ప్రతీకగా, ధైర్యసాహసాలకు నిదర్శనంగా నిలిచిన ఇందిరా గాంధీ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆమె ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కొనసాగించాలని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఇందిరా గాంధీకి ఘనంగా నివాళులర్పిస్తూ ఆమె దేశానికి చేసిన సేవలను మరోసారి స్మరించుకున్నారు.

83 ఆడబిడ్డల ఇళ్లలో పెళ్లి వెలుగులు



- రూ.83.09 లక్షల కళ్యాణ కానుక పంపిణీ చేసిన ఆరెకపూడి గాంధీ

కూకట్‌పల్లి ప్రతినిధి నవంబర్ 19 :

పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకాలు నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు.కూకట్‌పల్లి మండల పరిధిలోని వివేకానంద నగర్, హైదర్ నగర్, ఆల్విన్ కాలనీ, వెంకటేశ్వర నగర్ డివిజన్లకు చెందిన 83 మంది లబ్ధిదారులకు మంజూరైన మొత్తం రూ.83,లక్షల,09,తొమ్మిది వేల, 628, ఆరు వందల ఇరవై ఎనిమిది రూపాయల ఆర్థిక సహాయాన్ని గురువారం వివేకానంద నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో చెక్కుల రూపంలో అందజేశారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి ఆరెకపూడి గాంధీ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలు తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా మారకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోతుల రాజేందర్ పటేల్, యాసిన్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేదవాడిని గొప్పగా చూడాలన్నదే ఇందిరమ్మ ఆకాంక్ష

- ప్రభుత్వ సలహాదారు, మాజీ కేంద్రమంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి
- ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన
- 400 మందికి పైగా వైద్య పరీక్షలు, 50 మంది పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

కుత్బుల్లాపూర్, నవంబర్ 19, :

ప్రతి పేదవాడిని గౌరవంగా, ఆత్మగౌరవంతో జీవించేలా చూడాలన్నదే దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఆకాంక్ష అని ప్రభుత్వ సలహాదారు, మాజీ కేంద్రమంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. దివంగత ఇందిరాగాంధీ 109వ జయంతిని పురస్కరించుకుని గురువారం గిరినగర్ డివిజన్ పరిధిలోని గిరినగర్ శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల ప్రాంగణంలో పాఠశాల కరస్పాండెంట్, కాంగ్రెస్ నాయకులు కట్టే శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో ఆర్.ఎన్.సి. ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన టీపీయూఎస్ తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు గంధం రాములు, పాఠశాల చైర్మన్ కట్టే సుగుణ, భీమయ్య యాదవ్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం



ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది పారిశుధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు.

పేదల సంక్షేమమే ఇందిరమ్మ లక్ష్యం

ఈ సందర్భంగా డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి మాట్లాడుతూ.. దేశంలోని పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన ఉక్కు మహిళ ఇందిరాగాంధీ అని కొనియాడారు. పేదలకు భూములు అందించాలనే లక్ష్యంతో అనేక భూసంస్కరణలు తీసుకొచ్చి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన లక్షలాది మందికి ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూములు అందించిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. 'రోటీ, కపడా ఔర్ మకాన్' నినాదంతో నిరుపేదల సంక్షేమానికి విశేష కృషి చేసిన మహనీయురాలు ఇందిరాగాంధీ అని గుర్తు చేశారు.

ఇందిరమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

పాఠశాల కరస్పాండెంట్, కాంగ్రెస్ నాయకులు కట్టే శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేసినప్పుడే ఆమెకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ఇందిరమ్మ రాజ్యం.. ఇంటింటా సౌభాగ్యం' అనే నినాదంతో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

400 మందికి పైగా వైద్య పరీక్షలు

ఆర్.ఎన్.సి. ఆసుపత్రికి చెందిన అనుభవజ్ఞులైన వైద్య బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జనరల్ ఫిజీషియన్, కంటి, దంత వైద్య పరీక్షలతో పాటు బీపీ, షుగర్, ఈసీజీ, ఆర్థోపెడిక్ తదితర విభాగాల్లో 400 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ ముదిరాజ్, ఐఎన్‌టీయూసీ సీనియర్ కార్యనిర్వాహక అధ్యక్షులు జి. మణికంఠ, సీనియర్ నాయకులు కాపా సుబ్బారెడ్డి, పాషాభాయ్, అజయ్, కార్తీక్, తైలం శ్రీనివాస్, వరలక్ష్మి , ఉస్మాన్, సల్మాన్, మోమిన్ బాషా, ఆశ్రిత్, రఫీ, అమర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- 40వ వార్డు ప్రజలకు హరితహారం మొక్కల పంపిణీ
- జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అడువాల జ్యోతి

జగిత్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 19, :

పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా జగిత్యాల పట్టణంలోని 40వ వార్డులో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అడువాల జ్యోతి లక్ష్మణ్ గురువారం తన నివాసంలో వార్డు ప్రజలకు హరితహారం మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో చెట్ల పాత్ర ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. చెట్లు పెంచడం వల్ల స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం లభిస్తాయని తెలిపారు. ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు పచ్చని ప్రకృతిని అందించవచ్చని పేర్కొన్నారు. హరితహారం కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో 40వ వార్డు ప్రజలు పాల్గొన్నారు.



నూతన జంటకు డాక్టర్ సత్యం దంపతుల ఆత్మీయ ఆశీస్సులు



కూకట్పల్లి ప్రతినిధి, నవంబర్ 19, :

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాజుల మహేష్ గౌడ్ ఆహ్వానం మేరకు ఎన్ కె ఎన్ ఆర్ గార్డెన్స్‌లో గురువారం నిర్వహించిన వెంకటేష్ గౌడ్ – సాయి ప్రియల రిసెప్షన్ వేడుకకు పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆప్యాయంగా ఆశీర్వదించి, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతుల వైవాహిక జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో నిండి కలకాలం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆత్మీయుల సమక్షంలో రిసెప్షన్ వేడుక ఆనందోత్సాహాల మధ్య వైభవంగా జరిగింది.

గాంధీ భవన్‌లో ఇందిరా జయంతి వేడుకల్లో డీసీసీ అధ్యక్షురాలు సుగుణక్క

హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 19, :

హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో గురువారం నిర్వహించిన భారత మాజీ ప్రధాని, ఉక్కు మహిళ స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతి వేడుకల్లో టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ సమగ్రత, సమైక్యత, అభివృద్ధి కోసం ఇందిరా గాంధీ అందించిన సేవలను, దేశ చరిత్రలో ఆమె పోషించిన కీలక పాత్రను నాయకులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి పలువురు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గోసాన్‌పల్లి ఐకేపీ కేంద్రంలో కోతుల వీరంగం

- స్కూల్ ఆవరణలో హల్ చల్ చేస్తూ పిల్లలను, యాజమాన్యాన్ని భయానికి గురి చేస్తున్న కోతులు
- రెండేళ్లుగా తప్పని కోతుల బెడద
- ఆందోళన చెందుతున్న రైతులు.. గ్రామస్తులు..

దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 19: :

దుబ్బాక మండలం గోసాన్ పల్లి గ్రామ పంచాయతీ ఆవరణలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. కోతుల గుంపులు కేంద్రంలోకి చొరబడి ధాన్యాన్ని చిందరవందర చేస్తూ రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. గత రెండేళ్లుగా గోసాన్‌పల్లిలో కోతుల సమస్య కొనసాగుతున్నప్పటికీ సంబంధిత ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచ్ ఇప్పటివరకు సమస్యను పరిష్కరించలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల కారణంగా ఇప్పటికే పలువురు రైతులు తమ పంటలను నష్టపోయామని తెలిపారు. ప్రస్తుతం ఐకేపీ కేంద్రానికి రైతులు ధాన్యాన్ని తీసుకొస్తున్న సమయంలో కోతుల గుంపులు వచ్చి ధాన్యాన్ని చిందరవందర చేస్తూ, కింద పడేస్తూ నష్టం కలిగిస్తున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై పలుమార్లు గ్రామ సర్పంచ్‌తో పాటు సంబంధిత ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పాఠశాలకు వెళ్లాలంటేనే భయానికి లోనవుతున్న విద్యార్థులు. గ్రామ పాఠశాల గోడల మీద కోతులు ఎక్కువ సంఖ్యలో విరంగం చేయడంతో విద్యార్థులు తమ తల్లిని గానీ, తాండ్రిని గానీ పాఠశాల వరకు తీసుకెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడింది.



స్కూల్ యాజమాన్యం కూడా స్కూల్ క్లాస్ రూమ్లలోకి వెళ్లాలంటేనే ఇబ్బంది పడుతున్నారని, అంతే కాకుండా స్కూల్లో పిల్లలకు వంట చేసే వంట వారిని సైతం వంట చేయనియకుండా కోతులు బయపెడుతున్నట్లు వంట సామాన్లు పాడు చేస్తున్నట్లుగా స్కూల్ యాజమాన్యం వంట వారు వాటిని తగిన అధికారులకు చెప్పి వాటి నుండి విముక్తి కల్పించాలని కోరుకుంటున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించాలి

సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కోతుల బెడదను నివారించేందుకు తగిన చర్యలు చేపట్టాలని, ఐకేపీ కేంద్రంలో రైతుల ధాన్యానికి రక్షణ కల్పించాలని గోసాన్‌పల్లి గ్రామ ప్రజలు కోరుతున్నారు. రైతులు మరింత నష్టపోకుండా శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

భక్తిపారవశ్యంలో వివేకానంద నగర్.. వైభవంగా మహా పడిపూజ

- మాధవరం సందీప్ రావు ఆధ్వర్యంలో ఘనంగా అష్టాదశ పడిపూజ

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 19, :

వివేకానంద నగర్ కాలనీలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో గురువారం అష్టాదశ మహా పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వ హించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తనయుడు మాధవరం సందీప్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భక్తులు హాజరయ్యారు.ప్రత్యేక పూజలు, అయ్యప్ప భజనలతో ఆలయ ప్రాంగణం మార్మో గింది. ఈ కార్యక్రమంలో ఎమ్మె ల్సీలు శంభీపూర్ రాజు, నవీన్ కుమార్, మాజీ కార్పొరేటర్లు మాధవరం రంగారావు, జూపల్లి సత్యనారాయణ తదితర ప్రము ఖులు, నాయకులు, భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసా దాలు పంపిణీ చేశారు.





ఇందిరా గాంధీ జయంతి వేడుకల్లో ఘన నివాళులు

- కుత్బుల్లాపూర్‌లో ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు దమ్మని శ్రవణ్ కుమార్



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 19, :

జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని కుత్బుల్లాపూర్ డివిజన్, జీడిమెట్ల మెయిన్ రోడ్డు చౌరస్తాలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద భారత మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు దమ్మని శ్రవణ్ కుమార్ ఇందిరా గాంధీకి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా దమ్మని శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రిగా ఇందిరా గాంధీ దేశ అభివృద్ధికి విశేష కృషి చేశారని, ఆమె సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆమె జయంతిని పురస్కరించుకుని గురువారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి కుటుంబానికి ఇందిరా జీవిత బీమా పథకాన్ని ప్రారంభించడం, మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు తదితర అర్హులైన వారికి పెన్షన్లు అందించే దిశగా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అశించిన స్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని పాలన సాగిస్తోందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గమనించాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 286వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిట్ల ప్రవీణ్ కుమార్ ముదిరాజ్, మధుసూదన్ రెడ్డి, డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు రంగయ్య, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుజాత యాదవ్, డివిజన్ అధికార ప్రతినిధి గుమ్మడి మధుసూదన్ రాజు, డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కీర్తి రామకృష్ణ, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు శ్యామల, రేష్మి, లక్షి తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 లోగోను ఆవిష్కరించిన కలెక్టర్



జగిత్యాల కలెక్టరేట్, నవంబర్ 19, :

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ – 2026 క్రీడా పోటీలకు సంబంధించి లోగోను కలెక్టరేట్ లోని మీటింగ్ హాలులో జగిత్యాల జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్ గురువారం ఆవిష్కరించారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ – 2026లో భాగంగా వివిధ క్రీడా అంశాల్లో పోటీలను డిసెంబర్ 11 నుండి 22 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు, క్రీడల పట్ల ఆసక్తిని ప్రోత్సహించడం, జాతీయ స్థాయిలో ప్రతిభను చాటుకునేందుకు యువ క్రీడాకారులకు ఈ క్రీడలు మంచి వేదికగా నిలవనున్నాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా ఆసక్తి పెంపొందించుకోవాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదలను పెంపొందిస్తాయని తెలిపారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ వంటి జాతీయ స్థాయి క్రీడా కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ట్రక్ పార్క్ భూములపై సమరశంఖం

- అమ్మకం ఆపే వరకు ఐక్య పోరాటం
- 22, 23 తేదీల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నిరాహార దీక్ష

కూకట్పల్లి ప్రతినిధి, నవంబర్ 19, :

కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల అమ్మకాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ వివిధ రాజకీయ పార్టీలు ఐక్య పోరాటానికి సిద్ధమయ్యాయి.గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు తదితరుల పాల్గొనగా అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ప్రజాపంథా నాయకులు, పలువురు జిల్లా నాయకులు పాల్గొని ట్రక్ పార్క్ భూముల అమ్మకంపై తమ నిరసన గళాన్ని వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. గతంలో రైతుల నుంచి సేకరించి ప్రజా అవసరాల కోసం కేటాయించిన భూములను వేలం వేయడం అన్యాయమని అన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా భవిష్యత్తు తరాల అవసరాల కోసం ఈ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వం భూముల అమ్మకపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22, 23 తేదీల్లో శాంతియుత నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ పోరాటానికి సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ తదితర వామపక్ష పార్టీలు, ఇతర రాజకీయ



పార్టీలు మద్దతుగా నిలవనున్నాయి. ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన భూములను కాపాడుకునే వరకు ఐక్య పోరాటం కొనసాగిస్తామని, ట్రక్ పార్క్ భూముల అమ్మకాన్ని అడ్డుకుని తీరుతామని నాయకులు స్పష్టం చేశారు.

ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయం

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్
- ఇందిరా జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే

జగిత్యాల ప్రతినిధి, నవంబర్ 19, :

జగిత్యాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద భారత మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ సమగ్రత, సమైక్యత, అభివృద్ధి కోసం ఇందిరా గాంధీ చేసిన సేవలను స్మరించుకున్నారు. దేశ చరిత్రలో ఆమె సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఇందిరా గాంధీ జయంతి



సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం అమలు చేయడం జరుగుతుందని అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు పక్షాన ముఖ్య మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఇందిరా గాంధీ హయాంలో నిర్మించిన ప్రాజెక్టు కెనాల్ వ్యవస్థతో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందించి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో అనేక కార్యాలయాలు ఇందిరా హయంలో ఏర్పాటు చేసినవే అని అన్నారు. జగిత్యాల పట్టణంలో 31 వేల కుటుంబాలకు రేపటి నుంచి ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుందని అన్నారు. జగిత్యాల పట్టణ అభివృద్ధికి నిరనతరం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టు సతీష్, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్లు గిరి నాగభూషణం అడువల జ్యోతి లక్ష్మణ్, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు బొలిశెట్టి గంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చందనోత్సవాల్లో భాగంగా యాగశాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు

- రాజగోపురంపై కలశాల ఏర్పాటు

చొప్పదండి/కొండగట్టు, నవంబర్ 19, :

కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహించబడుతున్న స్వామివారి చందనోత్సవ మహోత్సవాల్లో భాగంగా గురువారం యాగశాలలో వేద పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో వివిధ వైదిక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. యాగశాలలో ప్రత్యేక పూజలు, హోమాది కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. చందనోత్సవ మహోత్స వాలను సంప్రదాయబద్ధంగా, వైభ వంగా నిర్వహించబడుచున్నవి. కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహిం చబడుతున్న చందనోత్సవ మహోత్సవాల్లో



భాగంగా ఆలయ రాజగోపురంపై పవిత్రమైన కలశాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఆలయ ఆగమ శాస్త్ర సంప్రదాయాలకు అనుగుణంగా చేపట్టిన ఈ కార్యక్రమం చందనోత్సవ వేడుకలకు మరింత శోభను తీసుకువచ్చింది. ఈ ఏర్పాట్లతో ఆలయ రాజగోపురం నూతన శోభను సంతరించుకుంది.

మిషన్ భగీరథ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం

జగిత్యాల ప్రతినిధి, నవంబర్ 19, :

జగిత్యాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మిషన్ భగీరథ అధికారులతో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల నియోజకవర్గ పరిధిలో ప్రజలకు మంచినీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ఎల్ నీ నో ప్రభావం దృష్ట్యా ప్రజలకు నిరంతరాయంగా, మెరుగైన తాగునీటిని అందించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని, నీటి సరఫరా సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో ఏఈలు చందన్, కృష్ణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.





ఇసుక, గ్రావెల్ బ్లాకుల ఈ వేలం నిర్వహణకు చర్యలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్



జగిత్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 19, :

జగిత్యాల జిల్లాలో ఇసుక, గోదావరి నది పరివాహక ప్రాంతాల్లోని ఖనిజ వనరుల గుర్తింపు, ఈ వేలం నిర్వహణకు సంబంధించి జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఆర్టి నం.72 2026 ఏప్రిల్ 18 ప్రకారం జిల్లాలో ఖనిజాల వేలం ప్రక్రియను నిబంధనల మేరకు చేపట్టాలని సూచించారు. ఎండపల్లి మండలం సూరారం, గోదావరిపేట గ్రామాల శివారులోని సర్వే నంబర్లు 41, 290, 296లలో ఒక్కొక్కటి 2.00 హెక్టార్ల చొప్పున మొత్తం ఆరు గ్రావెల్ (మొరం) బ్లాకులను గుర్తించినట్లు తెలిపారు. ఈ బ్లాకులకు ఈ-వేలం నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గుర్తించిన బ్లాకులకు నిర్బంధ రహిత పట్టా (ఎన్ఓసి) జారీకి కమిటీ ఆమోదం తెలిపిన నేపథ్యంలో తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, పర్యావరణం, అటవీ, రెవెన్యూ, నీటిపారుదల తదితర అంశాలను పరిశీలించి నిబంధనల ప్రకారం ఈ-వేలం ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, జిల్లా మైనింగ్ అధికారి, నీటిపారుదల, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాయిబాబా నగర్ డివిజన్ లోని ఆర్జీకే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: వారాల వినోద్ కుమార్

ప్రజా సమస్యల పరిష్కారమే నా ధ్యేయం..

ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటా

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 18, :



సాయిబాబా నగర్ డివిజన్ పరిధిలోని ఆర్జీకే ప్రాంతంలో నెలకొన్న పలు సమస్యలను స్థానిక మహిళలు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన వారాల వినోద్ కుమార్ గురువారం స్వయంగా ఆర్జీకే ప్రాంతాన్ని సందర్శించి, స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మహిళలు, స్థానికుల నుంచి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను త్వరితగతిన పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారాల వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన ధ్యేయమని, ప్రజలకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తారా సింగ్, రాజ్ కుమార్ ముదిరాజ్, రాజు యాదవ్, ఆటో స్టాండ్ అధ్యక్షులు శివ, నారాయణ, శంకర్, శ్యామ్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యపై స్పందన.. భౌరంపేట్ లో చిన్నారులకు టీకాల పంపిణీ ప్రారంభం!

అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లిన ఫలితం..

హర్షం వ్యక్తం చేసిన మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 18, : దుండిగల్



సర్కిల్ పరిధిలో చిన్నారులకు టీకాలు అందక తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రజా సమస్యను ప్రభుత్వ, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో భౌరంపేట్‌లో చిన్నారులకు టీకాల పంపిణీ కార్యక్రమం తిరిగి ప్రారంభమైంది. ఈ పరిణామంపై భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా వైద్య ఆరోగ్య శాఖలో సిబ్బంది కొరత, కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆందోళనల కారణంగా పీహెచ్‌సీ కేంద్రాల్లో చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు అందక తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ఈ సమస్యను ప్రజల పక్షాన పత్రికల ద్వారా వెలుగులోకి తీసుకెళ్లి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. తాజాగా భౌరంపేట్‌లో టీకాల పంపిణీ ప్రారంభం కావడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి సంబంధిత అధికారులు, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో పత్రికల పాత్ర ఎంతో కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, టీకాల పంపిణీ కేవలం ఒక్కరోజుకే పరిమితం కాకుండా దుండిగల్ సర్కిల్ పరిధిలోని అన్ని పీహెచ్‌సీలలో నిరంతరాయంగా కొనసాగించాలని అధికారులను కోరారు. అలాగే వైద్య ఆరోగ్య శాఖలో నెలకొన్న సిబ్బంది కొరతను తక్షణమే పరిష్కరించి, చిన్నారులకు ఎలాంటి అంతరాయం లేకుండా టీకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 22న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా జరిగేలా ముందస్తుగా అవసరమైన సిబ్బందిని నియమించి, ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా చూడాలని నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి సంబంధిత అధికారులను కోరారు. చిన్నారుల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రతి చిన్నారికి నిర్దేశిత సమయంలో టీకాలు అందేలా వైద్య శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన సూచించారు.

10+2 విద్యా విధానంపై ప్రభుత్వం స్పష్టమైన జీవో జారీ చేయాలి!

- ఇంటర్ కళాశాలలకు 9, 10 తరగతుల అనుమతులు వద్దు.. పాఠశాలలకు 11, 12 తరగతుల నిర్వహణకు అవకాశం కల్పించాలి
- ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శివరాత్రి యాదగిరి డిమాండ్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 18, :



రాష్ట్రంలో అమలు చేయనున్న 10+2 విద్యా విధానంపై ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన మార్గదర్శకాలతో కూడిన ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో) విడుదల చేయాలని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శివరాత్రి యాదగిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జగద్గిరిగుట్టలోని తన కార్యాలయం నుంచి ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. 10+2 విద్యా విధానాన్ని తాము స్వాగతిస్తున్నామని, అయితే ఈ విధానం అమలు పేరుతో ఇంటర్మీడియట్ కళాశాలలకు 9, 10 తరగతులు నిర్వహించేందుకు అనుమతులు ఇచ్చే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం పదో తరగతి వరకు గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలకు 11, 12 తరగతులు నిర్వహించుకునే అవకాశం కల్పించాలని కోరారు. బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలల మనుగడను దెబ్బతీసే నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. పదో తరగతి పూర్తయిన అనంతరం సుమారు 40 శాతం మంది విద్యార్థులు సామాజిక, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఉన్నత విద్యకు దూరమవుతున్నారనే ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలన్న ప్రభుత్వ ఆలోచన అభినందనీయమన్నారు. ఈ విధానం సమర్థవంతంగా అమలైతే విద్యార్థుల చదువులో కొనసాగింపు పెరగడం తోపాటు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. అయితే 10+2 విధానం అసలు లక్ష్యం పదో తరగతి వరకు విద్యను అందిస్తున్న పాఠశా లలను 12వ తరగతి వరకు విస్తరించడమే కావాలని, అంతేకానీ ఇంటర్మీడియట్ కళాశాలలకు 9, 10 తరగతులు అప్పగించడం కాదని పేర్కొన్నారు. అలాంటి నిర్ణయం తీసుకుంటే ఇప్పటికే తక్కువ ఫీజులతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తున్న వేలాది బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలల మనుగడ ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీని ప్రభావంతో చిన్న, మధ్యతరహా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గి, వాటిపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది ఉపాధికి కూడా ముప్పు ఏర్పడే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రస్తుతం పదో తరగతి వరకు ప్రభుత్వ గుర్తింపు కలిగిన ప్రైవేట్ పాఠశాలలకు అవసరమైన విద్యా ప్రమాణాలు, భద్రతా నిబంధనలకు లోబడి, అదనపు ఆర్థిక భారం మోపకుండా 11, 12 తరగతులు నిర్వహించుకు నేందుకు అఫిలియేషన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు 2027–28 విద్యా సంవత్సరం నుంచి 11వ తరగతిని అదే పాఠశాలలో కొనసాగించవచ్చా? లేక తప్పనిసరిగా ఇంటర్మీడియట్ కళాశాలల్లో చేరాలా? అనే విషయంలో స్పష్టత లేక అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితిని తొలగించేందుకు 10+2 విధానం అమలు, పాఠశాలల అప్‌గ్రేడేషన్, అఫిలియేషన్, ప్రవేశాలు, పాఠ్యప్రణాళిక, పరీక్షల విధానం తదితర అంశాలపై ప్రభుత్వం వెంటనే సమగ్ర మార్గదర్శకాలతో కూడిన జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానం కేవలం కార్పొరేట్ విద్యాసంస్థలకే ప్రయోజనం చేకూర్చేలా కాకుండా, బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలకు కూడా సమాన అవకాశాలు కల్పించేలా ఉండాలని సూచించారు. విద్యా సంస్కరణల పేరుతో దశాబ్దాలుగా విద్యారంగానికి సేవలందిస్తున్న చిన్న, మధ్యతరహా ప్రైవేట్ పాఠశాలలు మూతపడే పరిస్థితి రాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు 12వ తరగతి వరకు ఒత్తిడి లేని విద్యను అభ్యసించేలా, ఆ తర్వాత ఉన్నత విద్య ప్రవేశ పరీక్షలకు సమర్థవంతంగా సిద్ధమయ్యేలా విద్యా విధానంలో అవసరమైన మార్పులు తీసుకురావాలని సూచించారు. ఈ విధానంపై తుది నిర్ణయాలు తీసుకునే ముందు ట్రస్మా వంటి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘా లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

★విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, తల్లిదండ్రుల ప్రయోజనాలు, అందుబాటు ఫీజులతో నాణ్యమైన విద్య, బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలల పరిరక్షణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలుగా ఉండాలి. 10+2 విద్యా విధానాన్ని మేము వ్యతిరేకించడం లేదు.. స్వాగతిస్తున్నాం. అయితే పాఠశాలలను 12వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలే తప్ప, ఇంటర్మీడియట్ కళాశాలలకు 9, 10 తరగతులు కేటాయించి బడ్జెట్ పాఠశాలల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయవద్దు★★ అని డాక్టర్ శివరాత్రి యాదగిరి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

చందనోత్సవాలకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు
- బందోబస్తు ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించిన ఎస్పీ

జగిత్యాల/కొండగట్టు, నవంబర్ 19, :

కొండగట్టు శ్రీ అంజనేయస్వామి ఆలయంలో నిర్వహించనున్న చందనోత్సవాల సందర్భంగా ఈ నెల 20 నుంచి డిసెంబర్ 29 వరకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సంబంధిత పోలీస్, ఇతర శాఖల అధికారులతో కలిసి గురువారం కొండగట్టు ఆలయ పరిసర ప్రాంతాలను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

భక్తుల భద్రతకు ప్రాధాన్యత

ఆలయ పరిసర ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఉంచాలని, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భక్తులు తమ విలువైన వస్తువులు, వ్యక్తిగత సామగ్రి విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి

ఆలయానికి వచ్చే భక్తుల వాహనాల రాకపోకల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వాహనాలను నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన రహదారులు, ఆలయానికి వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని తెలిపారు.

సమన్వయంతో విధులు నిర్వహించాలి



బందోబస్తు విధుల్లో పాల్గొనే ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఎస్పీ సూచించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే స్పందించేలా సిబ్బంది సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, ఆలయ ఈఓ అంజనా రెడ్డి, మల్యాల సిఐ రాజ్ కుమార్, ఎస్ఐలు సందీప్, నరేష్, ఆలయ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నాచుపల్లి జేఎన్టీయూలో ఉచిత మెగా వైద్య శిబిరం

- వినియోగించుకున్న 200 మంది కళాశాల సిబ్బంది
- ఈఎస్ఐ వైద్య సేవలపై ప్రత్యేక అవగాహన సదస్సు

చొప్పదండి ప్రతినిధి, నవంబర్ 19, :



కొడిమ్యాల్ మండలం నాచుపల్లిలోని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. కరీంనగర్ ఫార్చ్యూన్ మెడికేర్ ఆసుపత్రి వైద్య బృందం సహకారంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నరసింహ ప్రారంభించి, సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి శిబిరాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన ఈ వైద్య శిబిరంలో కళాశాలలో పనిచేస్తున్న టీచింగ్, నాన్-టీచింగ్, జెట్ సోర్సింగ్, సెక్యూరిటీ, స్వీపర్ సిబ్బందికి ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించారు. సుమారు 200 మంది సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకుని చికిత్స పొందారు. శిబిరం అనంతరం ఫార్చ్యూన్ మెడికేర్ ఆసుపత్రి మేనేజర్ గణేశ్ ఆధ్వర్యంలో సిబ్బందికి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రిలో లభించే ఈఎస్ఐ సేవలు, చికిత్సా విధానాలపై సిబ్బంది అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నరసింహ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ప్రోగ్రామ్ అధికారులు ఎస్. ప్రవీణ్ కుమార్, డాక్టర్ పి. సంగీత, వైద్య బృందం, క్యాంపు ఇంచార్జి గజవెల్లి గణేష్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమంత్ వాగులో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా!

- రైతుల పేరుతో అక్రమ దందా.. బుట్టాయిగూడెం గ్రామానికి ముప్పు!
- ఇసుక అక్రమాలకు అడ్డుకట్ట వేసేదెవరు? అధికారుల నిఘా ఏది?

ములుగు/కన్నాయిగూడెం, నవంబర్ 19, :

ములుగు జిల్లా, కన్నాయిగూడెం మండల పరిధిలోని బుట్టాయిగూడెం హనుమంత్ వాగులో రైతుల పేరుతో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. రైతుల అవసరాల కోసం అనుమతులు తీసుకుంటూ వాటి మాటున అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంతో బుట్టాయిగూడెం గ్రామానికి భవిష్యత్తులో ముప్పు పొంచి ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులంటే లెక్కలేదా?

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమను ఎవరూ ఏమీ చేయలేరనే ధీమాతో కొందరు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరికి ప్రతిపక్ష పార్టీల అండదండలు ఉన్నాయనే ప్రచారం కూడా స్థానికంగా సాగుతోంది. అక్రమ రవాణా వెనుక రాజకీయ అండ ఉందా? లేక అధికారుల నిర్లక్ష్యమా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హనుమంత్ వాగులో ఇసుక తరలింపుపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



బయటి దొరికే ఫుడ్ ఇప్పుడు ఇంట్లోనే...

వానాకాలంలో చిరుతిళ్లు తినడం బాగా ఎంజాయ్ చేస్తారు. అయితే, అలాగని బయటి ఫుడ్ తింటే ఆరోగ్యం పాడవుతుంది ఎలాగా? అని ఆలోచిస్తుంటారు. అయితే, బయట దొరికే ఫుడ్‌ని ఇలా ఇంట్లోనే ఈజీగా చేసుకోండి.





ఎగ్ పఫ్ కావాల్సినవి

- గోధుమ పిండి – రెండు కప్పులు
- కోడిగుడ్లు (ఉడికిన) – నాలుగు
- ఉప్పు, నీళ్లు, నూనె – సరిపడా
- వెన్న – మూడు టీస్పూన్లు
- పచ్చిమిర్చి – మూడు
- ఉల్లిగడ్డలు, టొమాటోలు – రెండేసి చొప్పున
- కారం – ఒక టీస్పూన్
- పసుపు – ఒక టీస్పూన్
- ధనియాల పొడి – ఒక టీస్పూన్
- గరం మసాలా – ఒక టీస్పూన్
- అల్లం వెల్లుల్లి పేస్ట్ – ఒక టీస్పూన్

తయారీ : ఒక గిన్నెలో గోధుమ పిండి, ఉప్పు, వెన్న వేసి నీళ్లు పోసి కలిపి ముద్ద చేయాలి. దాన్ని చపాతీలా వత్తి, నూనె రాసి నాలుగు వైపులా మడతపెట్టాలి. తర్వాత ఒక గిన్నెలో పెట్టి మూతపెట్టి పక్కనపెట్టాలి. ఒక పాన్‌లో నూనె వేడి చేసి, పచ్చిమిర్చి, ఉల్లిగడ్డ, టొమాటో తరుగు, ఉప్పు వేసి వేగించాలి. అల్లం వెల్లుల్లి పేస్ట్, కారం, పసుపు, ధనియాల పొడి, గరం మసాలా వేసి కలపాలి. ఆ తర్వాత గిన్నెలో పెట్టిన పిండిని తీసి, ఉండలు చేయాలి. వాటిని చపాతీలా వత్తి, నూనె రాసి నాలుగు వైపులా మడతపెట్టి మరోసారి వత్తాలి. ఇలా మూడు లేదా నాలుగు సార్లు చేశాక, నాలుగు భాగాలుగా కట్ చేయాలి. ఒక్కోదాంట్లో రెడీ చేసిన స్టఫింగ్ దాంతోపాటు సగానికి కోసిన కోడిగుడ్డు పెట్టి మూసేయాలి. ఇడ్లీ ప్లేట్‌కి నూనె రాసి, వాటిని అందులో పెట్టాలి. మరో పాన్‌లో చిన్న గిన్నె బోర్లించి, దానిపై ఇడ్లీ ప్లేట్ పెట్టి మూతపెట్టాలి. కాసేపటి తర్వాత మూత తీసి, వాటిని రెండోవైపు తిప్పి పెట్టాలి. మళ్లీ మూతపెట్టి ఉడికించాలి



మసాలా కార్న్ టోస్ట్ కావాల్సినవి

- నూనె – రెండు టేబుల్ స్పూన్లు
- వెల్లుల్లి తరుగు – ఒక టేబుల్ స్పూన్
- ఉల్లిగడ్డ తరుగు – ఒక కప్పు
- జీలకర్ర పొడి – అర టీస్పూన్
- పచ్చిమిర్చి – ఒకటి
- కారం – ఒక టీస్పూన్
- గరం మసాలా – పావు టీస్పూన్
- ఫ్రెష్ క్రీమ్ – అర కప్పు
- చీజ్ – అర కప్పు
- కొత్తిమీర – కొంచెం
- వెన్న – ఒక టీస్పూన్
- బ్రెడ్ ముక్కలు – ఆరు

తయారీ : పాన్‌లో నూనె వేడి చేసి, వెల్లుల్లి, ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి తరుగు, మొక్కజొన్న గింజలు ఒకదాని తర్వాత ఒకటి వేసి వేగించాలి. అందులో కారం, జీలకర్ర పొడి, గరం మసాలా, ఫ్రెష్ క్రీమ్, చీజ్ కూడా ఒక్కోటిగా వేస్తూ కలపాలి. ఆ తర్వాత పాన్‌లో వెన్న వేడి చేసి బ్రెడ్ ముక్కని అందులో పెట్టాలి. దానిపై కార్న్ మిశ్రమం పెట్టి, చీజ్ చల్లి మూతపెట్టి కాసేపు ఉడికించాలి. తర్వాత బ్రెడ్ ముక్కల్ని కట్ చేసి, కొత్తిమీర తరుగు చల్లాలి.





ఆలూ మటర్ పఫ్ కావాల్సినవి

- గోధుమ పిండి – ఒక కప్పు
- నూనె, ఉప్పు, నీళ్లు – సరిపడా
- వాము – అర టీస్పూన్
- జీలకర్ర – అర టీస్పూన్
- పసుపు – అర టీస్పూన్
- గరం మసాలా – అర టీస్పూన్
- మొలకెత్తిన పచ్చి బటానీ – ఒక కప్పు
- పచ్చిమిర్చి – మూడు
- ఆలుగడ్డ, ఉల్లిగడ్డ – ఒక్కోటి
- అల్లం వెల్లుల్లి పేస్ట్ – ఒక టీస్పూన్
- ధనియాల పొడి – ఒక టీస్పూన్
- నిమ్మరసం – ఒక టీస్పూన్
- కార్న్‌ఫ్లోర్ – నాలుగు టేబుల్ స్పూన్లు

తయారీ : ఒక గిన్నెలో గోధుమ పిండి, వాము, నూనె, ఉప్పు వేసి నీళ్లు పోసి కలిపి ముద్ద చేయాలి. మూతపెట్టి పది నిమిషాలు పక్కన పెట్టాలి. మిక్సీజార్‌లో మొలకెత్తిన పచ్చి బటానీ, పచ్చిమిర్చి, ఆలుగడ్డ తరుగు, ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి కచ్చాపచ్చాగా గ్రైండ్ చేయాలి. పాన్‌లో నూనె వేడి చేసి, జీలకర్ర, ఉల్లిగడ్డ తరుగు వేసి వేగించాలి. ఆ తర్వాత అందులో ఆలూ బటానీ మిశ్రమం కూడా వేసి కలపాలి. అందులో నీళ్లు పోసి మూత పెట్టి ఉడికించాలి. ఆపై పసుపు, గరం మసాలా, ధనియాల పొడి, నిమ్మరసం, కొత్తిమీర వేసి కలపాలి. ఒక గిన్నెలో కార్న్‌ఫ్లోర్, నూనె వేసి పేస్ట్‌లా కలపాలి. రెడీ చేసిన పిండి ముద్దను ఉండలు చేసి, చపాతీల్లా వత్తాలి. ఒక్కో చపాతీకి ఆ పేస్ట్ పూసి, పిండి చల్లాలి. అలా నాలుగైదు చపాతీలను ఒకదానిపై ఒకటి పేర్చాలి. తర్వాత వాటన్నింటిని రోల్‌లా చుట్టి, రింగులుగా కట్ చేయాలి. వాటిని మరోసారి చపాతీల్లా వత్తి, నాలుగు ముక్కలుగా కట్ చేసి, ఒక్కోదాంట్లో ఆలూ బటానీ స్టఫ్ పెట్టి, మూసేయాలి. అలా చేసిన వాటిని వేడి నూనెలో వేగిస్తే ఆలూ మటర్ పఫ్ రెడీ.





కోపాన్ని కంట్రోల్ చేసుకోవాలంటే...

కోపంలో ఫ్రస్టేషన్, బాధ, అలగడం, దిగులు వంటివి కూడా ఉంటాయి. కోపం ఎక్స్‌ప్రెస్ చేసే విధానాన్ని బట్టి రిజల్ట్ వస్తుంది. అప్పుడప్పుడు చిరాకు, కోపం, విసుగు వంటివి రావడం సహజమే. మరి దీన్నుంచి బయటపడేదెలా?

- కోపం వస్తే.... మొదట చేయాల్సిన పని డీప్ బ్రీత్ తీసుకోవడం. కోపం తగ్గేవరకూ నిదానంగా శ్వాస తీసుకుంటూ... వదులుతూ ఉండాలి. తర్వాత మనలో మనం పాజిటివ్‌గా మాట్లాడుకోవాలి.
- కోపం ఎప్పుడు వచ్చినా దాన్ని ఎక్స్‌ప్రెస్ చేయకపోవడమే మంచిది. ఒకవేళ కోప్పడాల్సి వస్తే దాన్ని ఎక్స్‌ప్రెస్ చేసే విధానంలో జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఒక్కోసారి చిన్న చిన్నవాటికే ఎక్కువ కోపం చూపిస్తే అవి రిలేషన్‌షిప్ మీద ఎఫెక్ట్ చూపిస్తాయి.
- మీకు సపోర్ట్ చేసే వాళ్లకి మీ ఫీలింగ్స్ గురించి చెప్పండి. కాసేపు వాళ్లతో డిస్కస్ చేయండి. ప్రాబ్లమ్ ఏదైనా కోప్పడకుండా దాన్ని ఎలా సాల్వ్ చేయగలమో అని ఆలోచించాలి.
- ప్రాబ్లమ్ చిన్నదైతే ఎక్కువ రియాక్ట్ అవ్వకుండా ఉండేందుకు ప్రయత్నించాలి.
- నలుగురిలో ఉన్నప్పుడు వీలైనంత వరకూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండాలి.
- కోపాన్ని కంట్రోల్ చేసుకోవాలంటే ముందు ఎదుటి వాళ్లు చెప్పేది వినాలి. ఎందుకంటే వినడం కూడా ఒక కళే, ముందు అది నేర్చుకోవాలి. కమ్యూనికేషన్ పెంచుకోవాలి. ఇద్దరు మాట్లాడుకుంటుంటే ఒకరి మీద ఒకరికి నమ్మకం ఉండడం చాలా ఇంపార్టెంట్.
- అసౌకర్యంగా అనిపించే చోటు నుంచి దూరంగా వెళ్లాలి. కాసేపు హాయిగా నేచర్‌ను చూస్తూ వాకింగ్ చేయాలి.
- మీకు నచ్చిన పుస్తకాలు లేదా మోటివేట్ చేసే పుస్తకాలను చదువుకోవాలి. ఈ ప్రాబ్లమ్ మరీ ఎక్కువ ఉంటే ప్రొఫెషనల్ థెరపిస్ట్‌ను కలవడం మంచిది. ఆల్కహాల్ లేదా డ్రగ్స్ వంటి అలవాట్లు ఏవైనా ఉంటే కచ్చితంగా వాటిని మానుకోవాలి.
- కోపం వల్ల రిలేషన్‌షిప్స్ దెబ్బతింటాయి. దానివల్ల హెల్త్ ప్రాబ్లమ్స్ కూడా వస్తాయి. కోపం ఎక్కువ రోజులుంటే బీపీ పెరుగుతుంది. హార్ట్ ప్రాబ్లమ్స్, తలనొప్పి, స్కిన్ డిజార్డర్స్, అరుగుదల సమస్యలు వంటివి వస్తాయి. అంతేకాకుండా ఆల్కహాల్ తాగడం, క్రైమ్ చేయడం, ఇతరులను అవమానించడం వంటివి జరుగుతాయి.

పచ్చిమిర్చిని ఇలా కూడా వాడొచ్చు!



- పచ్చిమిర్చి కట్ చేసిన తర్వాత కొందరికి చేతులు మండుతాయి. అలాంటప్పుడు చేతులకు పంచదార రుద్దుకుంటే మంచి ఉపశమనం లభిస్తుంది.
- మాంసాన్నివేయించేటప్పుడు అది బంగారు గోధుమ రంగులో మంచి లుక్ రావాలంటే మాంసంపై మిరపకాయ ముక్కలను చల్లితే చాలు.
- పచ్చిమిరపకాయల్ని కాసింత పసుపుతో చేర్చి సీసాలో నిలువ చేస్తే ఎరుపు రంగుకు మారకుండా ఉంటాయి.
- పచ్చిమిర్చి ఎక్కువ రోజులు ఫ్రెష్ ఉండాలంటే మొదట శుభ్రంగా కడిగి, ఆరబెట్టాలి. మిర్చి తొడిమలు తీసి, గాలి చొరబడని డబ్బా అడుగున టిష్యూ పేపర్ వేసి మిర్చిని దానిపై పెట్టాలి. వాటిపైన టిష్యూ పేపర్ వేసి మూత పెట్టి ఫ్రిజ్‌లో పెట్టాలి. పదిహేను రోజులకొకసారి టిష్యూ పేపర్ మార్చితే రెండు నెలల పాటు పచ్చిమిర్చి



కేవలం తొలి రోజు కోసమే.. తుది జట్టును ఎంపిక చేయం కదా: సితాన్షు

న్యూజిలాండ్‌తో తొలి టెస్టు మొదటి రోజు ఫస్ట్ సెషన్‌లో టీమ్ఇండియా పేసర్లు అదరగొట్టారు. నాలుగు వికెట్లు తీసి ప్రత్యర్థిలో వణుకు పుట్టించారు. కానీ, ఆ తర్వాత కేవలం ఒక్క వికెట్ తీసి భారీగానే పరుగులు సమర్పించారు. జస్ప్రీత్ బుమ్రా (3/52) ఒత్తిడి తీసుకొచ్చినప్పటికీ.. అన్షుల్ కాంబోజ్, ఆకాశ్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణ నుంచి రెండో సెషన్‌లో పెద్దగా సహకారం లేదు. అయితే, మహ్మద్ సిరాజ్, గుర్నూర్ బ్రార్‌లో ఒకరికి కూడా ఈ మ్యాచ్ తుది జట్టులో అవకాశం ఇవ్వకపోవడంతో మేనేజ్‌మెంట్‌పై విమర్శలు వచ్చాయి. క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ కూడా సిరాజ్‌ను ఎంపిక చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే తొలి రోజు ఆట ముగిసిన తర్వాత ప్రెస్ కాన్ఫరెన్స్‌లో బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ దీనిపై స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు.



గ్లెన్ ఫిలిప్స్, నికోల్స్ పోరాటం.. భారత్‌కు ఐదు వికెట్లు

టీమిండియాతో తొలి టెస్టులో న్యూజిలాండ్ అద్భుత రీతిలో తిరిగి పుంజుకుంది. గ్లెన్ ఫిలిప్స్‌తో కలిసి హెన్రీ నికోల్స్ ఆతిథ్య జట్టును పటిష్ట స్థితిలో నిలిపాడు. ఫలితంగా తొలి రోజు ఆట ముగిసే సరికి న్యూజిలాండ్ ఐదు వికెట్ల నష్టానికి 243 పరుగులు చేయగలిగింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా వెల్లింగ్‌టన్ వేదికగా న్యూజిలాండ్- భారత్ మధ్య గురువారం తొలి టెస్టు మొదలైంది. బేసిన్ రిజర్వ్ మైదానంలో టాస్ గెలిచిన టీమిండియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఈ క్రమంలో ఆది నుంచే భారత పేసర్లు చెలరేగారు.

ఆదిలోనే చెలరేగిన భారత పేసర్లుఓపెనర్లలో కెప్టెన్ టామ్ లాథమ్‌ను జస్ప్రీత్ బుమ్రా డకౌట్ చేయగా.. డెవాన్ కాన్వేను నాలుగు పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద అన్షుల్ కాంబోజ్ పెవిలియన్‌కు పంపాడు. వన్‌డౌన్‌లో వచ్చిన రచిన్ రవీంద్ర (15) వికెట్‌ను ఆకాశ్ దీప్ తన ఖాతాలో వేసుకోగా.. డారిల్ మిచెల్ (1) రూపంలో మరో కీలక వికెట్‌ను బుమ్రా దక్కించుకున్నాడు. వికెట్ కీపర్ బ్యాటర్ టామ్ బ్లండెల్ (5) కూడా వెనక్కి పంపాడు. ఫలితంగా ఉదయం సెషన్‌లో న్యూజిలాండ్ కేవలం 70 పరుగులు చేసి ఏకంగా ఐదు వికెట్లు కోల్పోయింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో వన్‌డౌన్ బ్యాటర్ హెన్రీ నికోల్స్, ఆల్‌రౌండర్ గ్లెన్ ఫిలిప్స్ కలిసి అద్భుత రీతిలో పోరాడారు. నికోల్స్, ఫిలిప్స్ సంచలనంనికోల్స్ శతక్కొట్టగా.. ఫిలిప్స్ సెంచరీకి చేరువయ్యాడు. తొలి రోజు ఆట ముగిసేసరికి నికోల్స్ 221 బంతులు ఎదుర్కొని 14 ఫోర్ల సాయంతో 113 పరుగులు.. ఫిలిప్స్ 182 బంతుల్లో 13 ఫోర్లు బాది 94 పరుగులతో అజేయంగా నిలిచారు. ఇద్దరూ కలిసి ఆరో వికెట్‌కు అబేధ్యంగా 173 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. మొత్తానికి తొలి రోజు 82 ఓవర్ల ఆట మాత్రమే సాగగా.. ఐదు వికెట్ల నష్టానికి న్యూజిలాండ్ 243 పరుగులు చేసింది. ఆదిలో తడబడ్డా నికోల్స్, ఫిలిప్స్ పోరాటం వల్ల ఒక రకంగా మొదటి రోజు టీమిండియాపై పైచేయి సాధించగలిగింది.

తుదిజట్లు భారత్‌కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్, దేవదత్ పడిక్కల్, శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషభ్ పంత్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, ధ్రువ్ జురెల్, ఆకాశ్ దీప్, అన్షుల్ కాంబోజ్, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిధ్ కృష్ణ.
న్యూజిలాండ్‌టామ్ లాథమ్, డెవాన్ కాన్వే, హెన్రీ నికోల్స్, రచిన్ రవీంద్ర, డారిల్ మిచెల్, టామ్ బ్లండెల్ (వికెట్ కీపర్), గ్లెన్ ఫిలిప్స్, నాథన్ స్మిత్, కైలీ జెమీషన్, మ్యాట్ హెన్రీ, జేకబ్ డఫీ.





తొలి టెస్టులో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసిన దక్షిణాఫ్రికా

జొహన్నెస్‌బర్గ్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో సౌతాఫ్రికా 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. దీంతో 2 టెస్టుల సిరీస్‌లో దక్షిణాఫ్రికా 1-0 ఆధిక్యంలో నిలిచింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లా జట్టు తమ మొదటి ఇన్నింగ్స్‌లో 400 పరుగుల భారీ స్కోర్ సాధించింది. 22 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన బంగ్లాదేశ్‌ను తౌహిద్ హృదయ్ (137), లిటన్ దాస్ (120) ఆదుకున్నారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 206 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో బంగ్లాదేశ్ నాలుగుందల పరుగుల మార్క్‌ను చేరుకోగలిగింది. సౌతాఫ్రికా బౌలర్లలో కగిసో రబాడ ఐదు, డేన్ ప్యాటర్సన్ నాలుగు వికెట్లు చొప్పున పడగొట్టారు.
అనంతరం సౌతాఫ్రికా కూడా తమ తొలి ఇన్నింగ్స్‌లో 557 పరుగుల భారీ స్కోర్ చేసి ఆలౌటైంది. మార్క్వెస్ అకెర్‌మాన్ (157), ర్యాన్ రికెల్టన్ (102) సెంచరీలతో చెలరేగగా.. లోయర్ ఆర్డర్‌లో కగిసో రబాడా (72) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో ప్రోటీస్‌కు 157 పరుగుల కీలక తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఆ తర్వాత 157 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్‌కు సఫారీ బౌలర్లు చుక్కలు చూపించారు.
స్పిన్నర్ సైమన్ హార్మర్ 6 వికెట్లు పడగొట్టగా..రబాడ 3 వికెట్లు సాధించడు. ఫలితంగా బంగ్లా 168 పరుగులకే ఆలౌట్ అయింది. కేవలం 12 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని మాత్రమే బంగ్లా జట్టు సౌతాఫ్రికా ముందు ఉంచింది. ఈ లక్ష్యాన్ని ప్రోటీస్ కేవలం ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి చేధించింది.

ఘోర రోడ్డు ప్రమాదం.. చేయి కోల్పోయిన కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ పతక విజేత

మలేషియాకు చెందిన ప్రముఖ వెయిట్‌లిఫ్టర్, కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ పతక విజేత మొహమ్మద్ హఫీజుద్దీన్ రోస్లన్ (21) ఘోర రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడి కుడి చేతిని వైద్యులు తొలగించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని మలేషియా వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్య అధ్యక్షుడు అయూబ్ రెహ్మత్ వెల్లడించాడు.
శారీరకంగా కోలుకుంటున్నప్పటికీ ఈ ఘటన హఫీజుద్దీన్ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపిందని అయూబ్ ఆవేదన వ్యక్తం చేశాడు. మలేషియా వెయిట్‌లిఫ్టింగ్ క్రీడకు ఇది తీరని లోటని పేర్కొన్నాడు. హఫీజుద్దీన్ వైద్య ఖర్చులన్నింటినీ మలేషియా ప్రభుత్వం భరించనుందని స్పష్టం చేశాడు. నేషనల్ స్పోర్ట్స్ కౌన్సిల్ (ఎన్ఎస్‌సీ) ద్వారా అతడికి బీమా ప్రయోజనాలు కూడా అందనున్నాయని వెల్లడించాడు.
కాగా, గతేడాది జులైలో గ్లాస్గో వేదికగా జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో 88 కేజీల విభాగంలో హఫీజుద్దీన్ స్వర్ణ పతకం సాధించాడు. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లోనూ పతకం సాధించే సత్తా ఉన్న యువ అథ్లెట్‌గా గుర్తింపు పొందాడు.ఇంతలోనే ఈ ప్రమాదం అతడి క్రీడా భవిష్యత్తును అంధకారంగా మార్చింది.





టెన్నిస్ ఛాంపియన్‌గా లారా దత్తా కుమార్తె.. గర్వంతో ఉప్పొంగిన మాజీ విశ్వసుందరి!

బాలీవుడ్ నటి, మాజీ విశ్వసుందరి లారా దత్తా తన కుమార్తె సైరా సాధించిన అద్భుత విజయాన్ని ఘనంగా సెలబ్రేట్ చేసుకుంటున్నారు. యూఏఈలోని ఫుజైరాలో ఉన్న 'టెన్నిస్ & కంట్రీ క్లబ్' వేదికగా జరిగిన టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో సైరా విజేతగా నిలిచింది. తన కుమార్తె ఘనతపై గర్వం వ్యక్తం చేస్తూ లారా దత్తా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా టోర్నమెంట్‌కు సంబంధించిన పలు ఫోటోలను అభిమానులతో పంచుకున్నారు. కోర్టులో సైరా అడుతున్న దృశ్యాలతో పాటు, ఇద్దరు అధికారుల సమక్షంలో ట్రోఫీ, ప్రైజ్ చెక్ అందుకుంటున్న ఫోటోలను ఆమె షేర్ చేశారు. మరో ఫోటోలో తన కుమార్తెతో కలిసి మిర్రర్ సెల్ఫీకి ఫోజులిచ్చిన లారా, సైరా గోప్యతకు భంగం కలగకుండా అన్ని ఫోటోలలో ఆమె ముఖం కనిపించకుండా ఎమోజీలతో కవర్ చేయడం విశేషం. ఆటలోనూ, వ్యక్తిగతంగానూ తన కుమార్తె ఎంతో ఎదిగిందని లారా దత్తా ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు. "ఇప్పుడు నాకంటే ఎత్తుగా ఎదిగిన నా చిన్నారితో కలిసి టూర్‌కు వెళ్లాను.. విజయంతో తిరిగి వచ్చాము, ఎంతో గర్వంగా ఉంది"అంటూ ఆమె భావోద్వేగపూరిత క్యాప్షన్ జోడించారు. కాగా, లారా దత్తా, భారత మాజీ టెన్నిస్ ఛాంపియన్ మహేష్ భూపతిలకు మార్తెసైరా. 2011 ఫిబ్రవరిలో ముంబైలో రిజిస్టర్ మ్యారేజ్, గోవాలో సంప్రదాయ క్రిస్టియన్ పద్ధతిలో వివాహం చేసుకున్న ఈ జంటకు 2012 జనవరిలో సైరా జన్మించింది. తండ్రి మహేష్ భూపతి పురుషుల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో 12 గ్రాండ్ స్లామ్ టైటిళ్లు గెలుచుకుని భారత అత్యుత్తమ టెన్నిస్ క్రీడాకారుల్లో ఒకరిగా నిలవగా, ఇప్పుడు కుమార్తె కూడా అదే బాటలో పయనిస్తూ సత్తా చాటుతోంది.మరోవైపు, సినిమాల విషయానికొస్తే లారా దత్తా ప్రస్తుతం నితీష్ తివారీ దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 'రామాయణ' చిత్రంలో కైకేయి పాత్రలో నటించి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. రణబీర్ కపూర్, సాయి పల్లవి, యష్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ సినిమాలో తన పాత్ర గురించి ఆమె ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

ఈ ప్రయాణంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్న..



నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ థ్రిల్లర్ 'మైసా'. ఈ సినిమాలో రష్మిక ఇంతకుముందెన్నడూ కనిపించని పవర్‌పుల్ అవతార్‌లో కనిపించనుండగా.. ఈ మూవీపై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ హైప్ క్రియేట్ అయింది. రావీంద్ర పుల్లే దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఆమె గోండ్ తెగకు చెందిన యువతి పాత్రను పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ప్రయాణం గురించి రష్మిక ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మైసాగా మారే ప్రయాణం షూటింగ్ ప్రారంభానికి చాలా కాలం ముందే మొదలైంది. శిక్షణ, సన్నాహాలు, ప్రతిరోజూ ఎదురైన చిన్న చిన్న సవాళ్లు.. గతంలో ఎప్పుడూ చేయని పనులను చేసేందుకు నన్ను నేను ప్రోత్సహించుకోవడం.. ఇదొక ప్రత్యేకమైన అనుభవం" అంటూ తన అనుభవాలను పంచుకున్నారు.

ప్రజెంట్ ఈ పోస్ట్ వైరల్ అవుతుండగా.. ఈ సినిమా మీ కెరీర్‌లోనే బెస్ట్ హిట్ ఇస్తుంది అంటూ కామెంట్స్ చేస్తున్నారు ఫ్యాన్స్. కాగా.. రష్మిక షేర్ చేసుకున్న ఈ వీడియోలో ఈ పాత్ర కోసం రష్మిక ప్రత్యేకంగా స్టంట్, కంబాట్ ట్రైనింగ్ తీసుకున్న విజువల్స్ అభిమానులు ఆశ్చర్చపరుస్తున్నాయి. ఈ చిత్రంలో ఈశ్వరి రావు, గురు సోమసుందరం, రాహుల్ రవీంద్రన్, రావు రమేష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తుండగా, అజయ్ సాయిపురెడ్డి, అనిల్ సాయిపురెడ్డి, వీరసాయి గోప యున్‌ఫార్ములా ఫిలింస్‌పై నిర్మిస్తున్నారు. భారీ అంచనాల మధ్య ఈ మూవీ నవంబర్ 27, 2026 గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నది. రష్మిక కొత్త అవతారం వెండితెరపై ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూసేందుకు ఫ్యాన్స్‌తో పాటు ప్రేక్షకులు కూడా ఈ మూవీ కోసం ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు.

మా తాత వ్యాఖ్యలను తప్పుగా పోస్ట్ చేశారు



సూపర్ స్టార్ రజినీకాంత్ తన 173వ చిత్రంతో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 'డ్రాగన్' ఫేమ్ అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి తాజాగా 'ధర్మన్' అనే పవర్ పుల్ టైటిల్‌ను ఫిక్స్ చేస్తూ పోస్టర్ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. ఇందులో రజినీకాంత్ 'ది డెడ్లీ డాక్టర్' అవతారంలో కనిపించనున్నట్లు తెలుపుతూ.. న్యాయాన్ని గెలిపించే ఓ వైద్యుడిగా ఆయన పాత్ర చాలా వైవిధ్యంగా, పవర్‌పుల్‌గా ఉండబోతుందని హింట్ ఇచ్చారు మేకర్స్. దీంతో సినిమాపై భారీ ఎక్స్‌పెక్టేషన్స్ నెలకొన్నాయి. కమల్ హాసన్ తన రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. ప్రస్తుతం ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది.

ఇక త్వరలో సెట్స్ పైకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న 'ధర్మన్'కు సంబంధించి తాజాగా మరో అప్డేట్ కోలీవుడ్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తుంది. ఈ చిత్రంలో ఇప్పటికే సీనియర్ నటి సిమ్రాన్, యంగ్ బ్యూటీ రాశి ఖన్నా భాగం అయినట్లు తెలుస్తుండగా.. తాజాగా మీనాక్షి చౌదరి కూడా ఈ ప్రాజెక్టులో భాగం అయిందని సమాచారం. ప్రస్తుతం డైరక్టర్ అశ్వత్ మారిముత్తు తమిళ స్టార్ శింబుతో 'STR51' కోసం వర్క్ చేస్తున్నాడు. ఇందులో మీనాక్షి చౌదరిని హీరోయిన్‌గా లాక్ చెయ్యగా.. ఇప్పుడు రాబోయే తలైవా 173లో కూడా ఎంపిక చేశారట. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు వైరల్ అవుతుండగా.. అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది.

ప్రతినాయకుడి పాత్ర... అవాస్తవం!



ప్రముఖ కథానాయకుడు గోపీచంద్ ఓ తమిళ తార సినిమాలో ప్రతినాయకుడిగా నటిస్తున్నారని కొన్ని రోజులుగా సామాజిక మాధ్యమాల్లో ఓ ప్రచారం సాగుతోంది. అందులో ఎంతమాత్రం వాస్తవం లేదని గోపీచంద్ బృందం బుధవారం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. గోపీచంద్ సినిమాలకు సంబంధించిన ఏ సమాచారమైనా ఆయన అధికారికంగా ప్రకటిస్తారని, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ఎవ్వరూ వ్యాప్తి చేయొద్దని అందులో పేర్కొంది. గోపీచంద్ కెరియర్ ఆరంభంలో ప్రతినాయక పాత్రలతోనే గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత కథానాయకుడిగా విజయాల్ని అందుకున్నారు.

నా కూతురి వ్యక్తిత్వాన్ని కించపరిస్తే ఊరుకోను..



స్టార్ నటుడు అర్జున్ సర్జా సోషల్ మీడియా ద్వారా షేర్ చేసిన కీలక నోట్ చర్చనీయాంశంగా మారింది. తన పెద్ద కూతురు, నటి ఐశ్వర్య అర్జున్ వ్యక్తిగత జీవితంపై వస్తున్న తప్పుడు ఆరోపణలపై స్పందించి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఈ విషయంపై ఇప్పటికే సంబంధిత అధికారులకు అధికారికంగా ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. తన చిన్న కూతురు అంజన వివాహం తర్వాత ఐశ్వర్య వ్యక్తిగత జీవితంపై రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయని అన్నారు. పెళ్లి సందర్భంగా తమ కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ ధన్యవాదాలు చెప్పిన అర్జున్, తన పెద్ద కూతురి జీవితం గురించి ఇలా బహిరంగంగా స్పందించాల్సి వస్తుందని తాను ఊహించలేదన్నారు. ప్రతి మహిళకు తన సొంత నిర్ణయాలు తీసుకునే హక్కు ఉంటుందని, అందుకే ఐశ్వర్య వ్యక్తిగత విషయాలకు గౌరవం ఇస్తూ తాను మౌనంగా ఉన్నట్లు తెలిపారు. ఆమె తన జీవితం గురించి మాట్లాడాలనుకున్నప్పుడు ఆమే స్వయంగా మాట్లాడుతుందని చెప్పారు.

అయితే తన కూతురి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ఆరోపణలు చేస్తుంటే చూస్తూ ఊరుకోలేనని అర్జున్ స్పష్టం చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఆమెను మద్యానికి బానిస అంటూ ముద్ర వేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని, దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని మండిపడ్డారు. సెలబ్రిటీలు అయినంత మాత్రాన వారి ప్రతిష్టను కించపరిచే హక్కు ఎవరికీ లేదని తేల్చి చెప్పారు. నిజానిజాలు తెలుసుకోకుండా కేవలం కంటెంట్ కోసం కొన్ని మీడియా సంస్థలు ఇలాంటి తప్పుడు వార్తలను ప్రచారం చేయడం దురదృష్టకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబ అండ లేని మహిళల విషయంలో ఇలాంటి ఆరోపణలు వారి గౌరవానికి, జీవితానికి మరింత ప్రమాదకరమని అర్జున్ ఆవేదన వ్యక్తం చేశారు. తన కూతురు గౌరవంగా, స్వతంత్రంగా జీవించే హక్కుకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని చెప్పారు. ఇకపై ఇలాంటి అసత్య ప్రచారాలను వ్యాప్తి చేస్తే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని అర్జున్ హెచ్చరించారు.

మన సంస్కృతిని ఎప్పటికీ తక్కువ చేయను..



నటి రాధికా ఆప్టే వ్యాఖ్యలపై నెలకొన్న వివాదానికి హీరోయిన్ కీర్తి సురేశ్ (Keerthy Suresh) తాజాగా వివరణ ఇచ్చారు. రాధికా ఆప్టే మాట్లాడిన సమయంలో ఆమె ఉద్దేశం తనకు పూర్తిగా అర్థం కాలేదని అన్నారు. ప్రస్తుతం తన కొత్త సినిమా 'సత్యవాన్ సావిత్రి' ప్రమోషన్లలో బిజీగా ఉన్న కీర్తి.. ఓ ఇంటర్వ్యూలో రాధికా ఆప్టే వ్యాఖ్యల వివాదంపై స్పందించారు. గతంలో ఓ తెలుగు సినిమాలో తనకంటే ఎక్కువ వయసున్న హీరోతో రొమాన్స్ చేయాల్సి వచ్చిందని, కథలో భాగంగా తన మేనమామను పెళ్లి చేసుకునే పాత్రలో నటించానని రాధికా ఆప్టే ఇటీవల వ్యాఖ్యానించారు. అవి సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఆ సమయంలో రాధికా ఆప్టే పక్కనే ఉన్న కీర్తి సురేశ్ నవ్వుతూ కన్పించడం కూడా విమర్శలకు కారణమైంది.

సమంతకు జరిగిన వేడుక ఇదే..: రాజ్ సోదరి ఎమోషనల్ పోస్ట్

ఈ క్రమంలోనే తాజాగా దీనిపై స్పందించిన కీర్తి.. "సినిమాలో మేనమామతో పెళ్లి గురించి రాధికా ఆప్టే ఏ ఉద్దేశంతో మాట్లాడారో మొదట నాకు అర్థం కాలేదు. ఆ తర్వాత ఆమె (Radhika Apte) మన దక్షిణాది సంప్రదాయం గురించి మాట్లాడుతున్నారని తెలిసింది. మన సంస్కృతిని నేను ఎప్పటికీ తక్కువ చేసి మాట్లాడను. ఉత్తరాది వారికి మన సంప్రదాయాల గురించి తెలియకపోవచ్చు" అని స్పష్టం చేశారు.

ప్రేక్షకుడి మనసును తాకేదే అసలైన కళ..



యంగ్ హీరోయిన్ సంయుక్త మీనన్ చేతినిండా సినిమాలతో ఫుల్ బిజీగా గడుపుతున్నారు. స్లమ్ డాగ్, హైందవ, స్వయంభు, బెంజ్, రాపో23, ది బ్లాక్ గోల్డ్ వంటి చిత్రాలు లైన్‌లో పెట్టిన ఈ భామ తీరిక లేకుండా షూటింగ్స్‌లో పాల్గొంటున్నారు. అయినప్పటికీ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ పలు పోస్టుల ద్వారా అభిమానులకు దగ్గరగా ఉంటున్నారు. తాజాగా, ఆమె నటనకు సంబంధించిన 'నవరస సాధన' శిక్షణకు చెందిన కొన్ని ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. గురు వేణు జీ ఆధ్వర్యంలో నటనకైరళి వేదికగా సాగిన ఈ సాధన తాలూకు దృశ్యాలను పంచుకుంటూ, కళలోని గొప్పదనాన్ని వివరిస్తూ ఓ ప్రత్యేక నోట్ రాశారు. అభినవగుప్తుడు చెప్పిన మాటలను సంయుక్త తన పోస్ట్‌లో గుర్తుచేశారు.

ఒక నాటకం లేదా సినిమాలో పండే రసం కేవలం నటించే నటుడిలోనో లేదా ఆ పాత్రలోనో మాత్రమే ఉండదని అన్నారు. ఆ కళను చూసి మనస్ఫూర్తిగా ఆస్వాదించే ప్రేక్షకుడి మనసుకు తాకేదే అసలైన కళ అని తెలిపారు. నటుడికి, ప్రేక్షకుడికి మధ్య ఉన్న తేడా చెరిగిపోయి, కేవలం ఆ భావం మాత్రమే మిగిలినప్పుడు మనసులో ఒక తెలియని ఆశ్చర్యం, ఆనందం కలుగుతాయని.. దాన్నే 'చమత్కార' అంటారని సంయుక్త వివరించారు. గురు వేణు జీ దగ్గర నేర్చుకున్న ఈ నవరస సాధన తనకు ఎంతో కొత్త అనుభూతిని ఇచ్చిందని సంయుక్త పేర్కొన్నారు. ప్రస్తుతం సంయుక్త పోస్ట్ చేసిన ఈ ఫోటోలు, అందులో ఆమె రాసిన లోతైన విషయాలు నెటిజన్లను, సినీ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

దయచేసి మా కుటుంబ గోప్యతను గౌరవించండి..



బాలీవుడ్ స్టార్ కపుల్ కియారా అద్వానీ, సిద్ధార్థ్ మల్హోత్రా తమ ఏడాది వయసున్న కూతురు సరాయా ప్రైవసీ విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల ఈ జంట తమ కూతురితో కలిసి ఎయిర్‌పోర్టులో కనిపించిన ఒక వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ వీడియోలో సిద్ధార్థ్ తన కూతురిని ఎత్తుకుని నడుస్తుండగా, పక్కనే కియారా నడుస్తూ కనిపించారు. అయితే ఆ క్లిప్‌లో చిన్నారి సరాయా ముఖం కొన్ని క్షణాల పాటు స్పష్టంగా కనిపించడంతో, వెంటనే అప్రమత్తమైన కియారా ఒక క్లాత్‌తో పాప ముఖాన్ని కవర్ చేసే ప్రయత్నం చేశారు.

అప్పటికే ఆ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడం మొదలైంది. తమ కూతురిని ఇప్పటివరకు మీడియా కంట పడకుండా, పబ్లిక్ అటెన్షన్‌కు దూరంగా ఉంచుతూ వస్తున్న ఈ జంట, తాజా పరిణామంతో వెంటనే స్పందించారు. తమ టీమ్ ద్వారా మీడియా సంస్థలకు, సోషల్ మీడియా యూజర్లకు ఒక విజ్ఞప్తి చేస్తూ అధికారిక ప్రకటన విడుదల చేశారు. తమ కూతురి ముఖం కనిపించేలా ఉన్న వీడియోలను షేర్ చేయవద్దని, ఒకవేళ పోస్ట్ చేయాల్సి వస్తే కచ్చితంగా చిన్నారి ముఖాన్ని ఏదైనా ఎమోజీతో లేదా బ్లర్ చేసి కవర్ చేయాలని వారు కోరారు. తమ కుటుంబ ప్రైవసీని గౌరవించి సహకరించాలని కోరారు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com